

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 18.0



వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ రాహుల్ కుమార్

జిల్లాలో 7,267 మందికి ఎపిక్ కార్డులు

భీమవరంటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఓటరుగా నమోదు చేసుకున్న వారికి ఇప్పటివరకు 7,267 ఎపిక్ కార్డులను అందించినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు.గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో ఎలక్టోరల్ రోల్ రివిజన్‌పై సమీక్షించగా జిల్లా నుంచి జేసీ పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో బీఎల్‌వో, ఏఈఆర్‌లకు అందరికీ ట్రైనింగ్ పూర్తి చేశామన్నారు. బీఎల్‌వోలకు ఐడీ కార్డులు అందించామన్నారు. జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)లో ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. 7,432 ఎపిక్ కార్డులు రాగా 7,267 కార్డులను పోస్టు ద్వారా ఓటర్లకు అందజేశామన్నారు. ఫారం 6,7,8 పెండింగ్ 115 ఉన్నాయని ఎన్నికల అధికారికి తెలిపారు. ఆర్డీవోలు కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, దాసిరాజు, ఖతీబ్ కౌసర్ బానో, ఎన్నికల సెక్షన్ డిప్యూటీ తహసిల్దార్ మర్రాపు సన్యాసిరావు పాల్గొన్నారు.

వాసవీ పెనుగొండ మండలం కోసం గెజిట్ నోటిఫికేషన్

అభ్యంతరాలు స్వీకరించనున్న అధికారులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి): వాసవీ పెనుగొండ మండలం పేరు కోసం జిల్లా గెజిట్‌లో నోటిఫికేషన్ జారీచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. జిల్లా అధికారులు చర్యలు తీసుకున్న తర్వాత ఇకపై పెనుగొండ మండలానికి వాసవీ పెనుగొండగా అధికారిక గుర్తింపు లభించనుంది. వాసవీ పెనుగొండ గ్రామంగా పేరు మార్చే ముందు స్థానికుల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తారు. నోటిఫికేషన్ జారీ అయిన నెలరోజుల్లోగా అభ్యంతరాలను తెలియజేయాలి. తదనుగుణంగా తదుపరి చర్యలు తీసుకోనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చిన మేరకు ప్రభుత్వం చకాచకా చర్యలు తీసుకుంటోంది. వాసవీమాత పెనుగొండ గ్రామానికి ఒక సెంటిమెంట్‌గా మారింది.ఈ ఏడాది అమ్మవారి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. అదేరోజు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు పెనుగొండను వాసవీ పెనుగొండగా మార్చనున్నట్టు ప్రకటించారు. తాజాగా అభ్యంతరాలను స్వీకరించడానికి నోటిఫికేషన్ జారీ చేస్తారు. ఆ తర్వాత పేరు మార్చనున్నారు. ఇదంతా లాంఛనప్రాయమేనని అధికారులు భావిస్తున్నారు.



ప్రకృతిసేద్యంపై అవగాహన కల్పిస్తున్న జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ వై.నూకరాజు

ప్రకృతి సేద్యంపై రైతులు దృష్టి పెట్టాలి

జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ వై.నూకరాజు

పాలకొల్లు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : లాభాలతో పాటు ఆరోగ్యపరంగా కలిసివచ్చే ప్రకృతి సేద్యంపై రైతులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ డాక్టర్ వై.నూకరాజు కోరారు.గురువారం పాలకొల్లు మండలంలోని జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ గ్రామాలైన ఉల్లంపర్రు, కొత్తపేట, చందపర్రు, లంకలకోడేరు, వెలివెల గ్రామాల్లో ప్రకృతి సేద్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు స్వయంగా తక్కువ ఖర్చుతో కషాయాలు, ద్రావణాలు తయారు చేసుకోవడం ద్వారా ఖర్చు తగ్గుతుందన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి

రథోత్సవం



రథోత్సవంలో స్వామివారి ఉత్సవమూర్తులు

భీమవరం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భీమవరం శ్రీరాంపురంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో కల్యాణమూర్తులైన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రథోత్సవం గురువారం సాయంత్రం వైభవంగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై రామలింగేశ్వరస్వామి వెంట రాగా వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వరస్వామి రథంపై ఆశీనులయ్యారు.ఎమ్మెల్యే రామాంజనేయులు కొబ్బరికాయ కొట్టి రథోత్సవం ప్రారంభించారు. అనంతరం దేవస్థానం నుంచి జంట కాలువల రోడ్డు వరకు భక్తజనుల స్వామివారి నామస్మరణలతో రథోత్సవం ముందుకు సాగింది. గురువారం తెల్లవారు జామున స్వామివారి కల్యాణం నిర్వహించారు.ఈవో దండు వెంకట కృషంరాజు, చైర్మన్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



జూమ్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

5న పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించాలి

భీమవరం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డిసెంబరు 5న పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయం నుంచి విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ అన్ని జిల్లా కలెక్టర్లతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. తల్లిదండ్రులను, స్థానిక ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి విద్యార్థుల ప్రగతి, విద్యాభివృద్ధికి చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాలను వివరించాలన్నారు. డీఈవో నారాయణ, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

సైబర్ ట్రాప్!



పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు

జిల్లాలో సైబర్ బాధితులు పెరుగుతున్నారు. లక్షల్లో పోగొట్టుకుంటున్నారు. ఒక వయసు దాటిన వారిని సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేసుకుంటున్నారు. డిజిటల్ అరెస్ట్ చేస్తున్నామంటూ బెదిరింపులు అధికమవుతున్నాయి. వృద్ధులను లక్ష్యంగా చేసుకుని భయపెడుతున్నారు. డ్రగ్స్, పోర్న్ రంగాలను సైబర్ నేరగాళ్లు కీలకంగా ఎంచుకుంటున్నారు.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

- భీమవరంలో ఒక వృద్ధ దంపతులకు నలుగురు కుమారులు. ఓ కుమారుడి పేరుతో డ్రగ్స్ పార్శిల్ వచ్చిందంటూ వృద్ధ దంపతులకు సమాచారం ఇచ్చారు. మీ కుమారుడిని డిజిటల్ అరెస్ట్ చేస్తున్నామంటూ బెదిరించారు. సొమ్ములు ఇస్తే సర్దుబాటు చేస్తామని చెప్పారు. దాంతో వారు సైబర్ నేరగాళ్లకు ఏకంగా రూ.92 లక్షలు చెల్లించారు.
- భీమవరంలో ఓ ప్రముఖ వైద్యునికి కూడా డ్రగ్స్ పార్శిల్ వచ్చిందంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. అతని నుంచి రూ. 72 లక్షలు కాజేశారు. తాజాగా విశ్రాంత ప్రొఫెసర్ నుంచి క్రిమినల్ కేసులున్నాయంటూ, అరెస్ట్ చేయడానికి వస్తున్నామని బెదిరించి రూ. 78 లక్షలు కాజేశారు.
- నర్సాపురంలో ఓ తహసీల్దార్‌కు కూడా సైబర్ నేరగాళ్ల నుంచి నిత్యం ఫోన్‌లు వచ్చేవి. ఆయన రూ. 8 లక్షల వరకు చెల్లించారు. చివరకు ఆయన ఆత్మహత్య చేసుకునేంత వరకు సైబర్ నేరస్తుల బెదిరింపులు వెళ్లాయి. ఇటీవల మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్‌ను వదల్లేదు. ఏసీబీ వాళ్లమంటూ బెదిరించి ఆయన నుంచి రూ. 2 లక్షలు వసూలు చేశారు.

సైబర్ నేరగాళ్ల వలలో జిల్లా వాసులు
డిజిటల్ అరెస్ట్‌లంటూ బెదిరింపులు
వృద్ధులు, రిటైరైన వారే టార్గెట్
మోసపోయిన తర్వాత స్టేషన్‌లో ఫిర్యాదులు
అవగాహన కల్పిస్తున్న పోలీసులు



జిల్లాలో సైబర్ క్రైం బాధితులు పెరిగిపోతున్నారు. బయటకు చెప్పనివారు ఎందరో ఉన్నారు. పోర్నోగ్రఫీని వినియోగించి ఎందరినో మోసం చేస్తున్నారు. లక్షల్లో సొమ్ములు గుంజుకుంటున్నారు. అటువంటి వారు సొమ్ములు పోగొట్టుకున్న విషయాన్ని బయటకు చెప్పడం లేదు. డ్రగ్స్‌తో పాటు, ఎక్సైజ్, సీబీఐ అధికారులమంటూ బెదిరింపులు వస్తుంటే సొమ్ములు చెల్లించి ఆ తర్వాత అనుమానంతో పోలీసులను ఆశ్రయిస్తున్నారు. గడచిన కొద్ది రోజుల వ్యవధిలోనే భీమవరంలో మూడు కేసులు నమోదయ్యాయి.

డిజిటల్ అరెస్ట్‌లు ఉండవు

డిజిటల్ అరెస్ట్‌లు ఉండవంటూ పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. కేంద్రం కూడా ఈ విషయంలో స్పష్టత ఇచ్చింది. డిజిటల్ అరెస్ట్ చేస్తామంటే ముందుగా పోలీసులకు ఫిర్యాదు చేయాలంటూ స్పష్టం చేసింది. జిల్లాలోనూ ప్రధాన కూడళ్లలో పోలీసులు బ్యానర్‌లు ఏర్పాటు చేశారు. అధికారులమంటూ ఎవరూ ఫోన్‌లు చేయరు. నేరగాళ్ల మాత్రమే ఇటువంటి ఫోన్‌లు చేస్తుంటారు. 55 ఏళ్లు దాటితే మానసికంగా కాస్త భయంగా ఉంటారు. వారిని లక్ష్యంగా చేసుకుంటున్నారని పోలీసులు గుర్తించారు. అజ్ఞాత వ్యక్తులు ఫోన్‌లు చేస్తే భయపడకుండా ముందుగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్పీ నయీం జిల్లా ప్రజలను కోరారు.

పోలీసులకు సవాల్

సైబర్ నేరగాళ్లను పట్టుకోవడం పోలీసులకు పెద్ద సవాల్‌గా మారింది. తమకు వచ్చిన ఓటీపీలను చెప్పాలంటూ సొమ్ములు కాజేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. వాటిని కూడా ఛేదించడం కష్టంగా మారింది. ఇప్పుడు నేరగాళ్ల కొత్త అవతారం - మిగతా 6లో..



సైబర్ నేరాల ముఠా గుట్టు రట్టు

కంబోడియాలోని ఇండియన్ స్కామర్‌లు 13 మంది అరెస్ట్

వివరాలు తెలుపుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి.. పాల్గొన్న పోలీసు అధికారులు.. సిబ్బంది -వివరాలు మెయిన్‌లో..

వంతెన కల సాకారం..

కోపల్లె బ్రిడ్జి నిర్మాణానికి రూ.12 కోట్లు మంజూరు

ఇచ్చిన హామీ నెరవేర్చిన డిప్యూటీ స్పీకర్ రఘురామ

వాహనదారుల్లో ఆనందం



కాళ్ళ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : భీమవరం-గుడివాడ రాష్ట్రీయ రహదారిపై కాళ్ళ మండలం కోపల్లె వద్ద నూతన వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.12 కోట్లు మంజూరు చేసింది. బొండాడ మేజర్ డ్రెయిన్‌పై ఎప్పుడో బ్రిటిష్ కాలంలో నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థకు చేరడం, రక్షణ గోడలు సరిగ్గా లేకపోవడం, ఇరుగ్గా ఉండటంతో వాహనదారులు భయపడుతూ రాకపోకలు సాగించేవారు. 1995 నుంచి 2024 వరకూ ప్రతిసారి సార్వత్రిక, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చేవారు. కానీ నెరవేర్చడంలో అధికార, ప్రతిపక్ష నాయకులు విఫలమయ్యారు. 'నిధులు వచ్చాయి.... పనులు జరుగుతాయి..' అని నాయకులు చెప్పడమే తప్ప ఇప్పటికీ నిర్మాణానికి నోచుకోలేదు. ప్రస్తుతం ఉండి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న కనుమూరు రఘురామకృష్ణ రాజు ఎట్టి పరిస్థితుల్లో బ్రిడ్జి నిర్మాణం చేపట్టి పూర్తిచేస్తానని చెప్పి తన హామీని నెరవేర్చే దిశగా నిధులు మంజూరు చేయించడంపై ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బొండాడ డ్రెయిన్‌పై నాలుగు వరుసలతో ఈ వంతెన నిర్మించనున్నట్లు రఘురామ కృష్ణరాజు తెలిపారు. ప్రజల చిరకాల కోరిక అయిన ఈ ప్రాజెక్ట్‌ను వచ్చే వేసవి నాటికి పూర్తి చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో మంజూరైన తొలి బ్రిడ్జి ఇదేనని ఆయన పేర్కొన్నారు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తమ కష్టాలు తీరినట్లేనని భావిస్తున్నారు.

టీడీపీ నాయకుల పాలాభిషేకం

దశాబ్దాల కాలంగా సమస్యగా మిగిలిపోయిన కోపల్లె బ్రిడ్జి నిర్మాణానికి రూ.12 కోట్లు నిధులు మంజూరు చేసిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ టీడీపీ నాయకులు గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కూటమి పాలనలోనే అభివృద్ధి సాధ్యమని చెప్పడానికి ఇదే సాక్ష్యమన్నారు. శిథిలావస్థకు చేరిన ఇరుకువంతెనతో ఎన్నో ఇబ్బందులు పడే వాళ్ళమని, అటువంటి చిరకాల సమస్య పరిష్కారం చేసేందుకు కృషి చేసిన డిప్యూటీ స్పీకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ పెన్మెత్స విశ్వనాథరాజు, డీసీ చైర్మన్ తోట ఫణిబాబు, సర్పంచ్ డొక్కు సోమేశ్వర రావు, ఉప సర్పంచ్ బూడి వెంకటపర్రాలు, మంద



పాటి కృష్ణమూర్తి, మంతెన కోదండ రామరాజు, సాగిరాజు సోమరాజు, గొర్ల లక్ష్మ ణస్వామి, మేకా వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

మండవారి గరువులో హైటెన్షన్

మునిసిపల్ చెత్త వేసేందుకు వచ్చిన వాహనాల అడ్డగింత

రోడ్డుపై మహిళల వంటా వార్పు

పొద్దుపోయేవరకు ఆందోళన



గ్రామస్థులతో చర్చిస్తున్న ఆర్డీవో దాసిరాజు

రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

నరసాపురం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుస్తుంబాదా పంచాయతీ పరిధిలో ఉన్న మండవారి గరువులో గురువారం హైటెన్షన్ నెలకొంది. పట్టణంలోని చెత్తను గ్రామంలోని జగనన్న కాలనీ సమీపంలో ఖాళీగా ఉన్న ప్రదేశంలో వేసేందుకు మునిసిపాలిటీ నిర్ణయించింది. చెత్త వేసేందుకు గురువారం నాలుగు లారీలు, నాలుగు ట్రాక్టర్లతో స్థలం వద్దకు వెళుతుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. అక్కడే టెంట్ వేసి ధర్నాకు దిగారు. వంట వార్పుతో నిరసన తెలిపారు. దీంతో ఆర్డీవో దాసిరాజు, మాజీ ఎమ్మెల్యే జానకీరామ్, కమిషనర్ అంజయ్య, తహసీల్దార్ సత్యనారాయణ, సీఐలు యాదగిరి, దుర్గాప్రసాద్, ఎస్సైలు వెంకట సురేష్, జయలక్ష్మి సంఘటన ప్రదేశానికి చేరుకున్నారు. ట్రాక్టర్లను అనుమతించేది లేదని గ్రామస్థులు భీష్మించారు. పట్టణంలో చెత్తను పచ్చని పొలాల మధ్య వేస్తే పంట కాల్వలు, వ్యవసాయం దెబ్బతింటుందని, సమీపంలోని మంచినీటి చెరువు కలుషితం అవుతుందని వాపోయారు. చెత్త వేసేందుకు మా గ్రామమే దొరికిందా అంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఐదు గంటల పాటు హైటెన్షన్ నెలకొంది. చెత్త అక్కడ వేయడం వల్ల ఎటువంటి ఇబ్బందులు ఉండదని అధికారులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. పరిసరాల్లో ఎక్కడ నివాసాలు లేవని, ప్రభుత్వ స్థలంలోనే చెత్త వేస్తున్నామన్నారు. చుట్టూ ఫెన్సింగ్ వాల్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అయినప్పటికీ గ్రామస్థులు ఒప్పుకోలేదు. పట్టణంలో చెత్త రోజు రోజుకు పెరిగి పోవడంతో దాన్ని ఎక్కడ వేయాలో తెలియక అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. చివరికి ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో వేస్తే ఎటువంటి ఇబ్బంది ఉండదని భావించారు. దానికి కూడా ప్రజల నుంచి నిరసనలు ఎదురు కావడంతో పేరుకు పోయిన చెత్తను ఎక్కడ తరలించాలన్న దానిపై తర్జనభర్జనలు పడుతున్నారు.

పాల్ ల్యాబ్ విద్యార్థులకు వరం


పాల్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పెనుమంట్ర, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండంలోని మార్టేరు శ్రీ వేణుగోపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పర్సనలైజ్డ్ లెర్నింగ్ (పాల్ ల్యాబ్) ల్యాబ్‌ను రాష్ట్ర పరిశీలకులు బి. కిషోర్‌బాబు జిల్లా, సమగ్ర శిక్ష ఏఎంవో చంద్రశేఖర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రిఫికేషన్ పనులను, మెటీరియల్ నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. పాల్‌ల్యాబ్ విద్యార్థులు పాలిట ఒక వరమన్నారు. సక్రమంగా ఉపయోగించుకోవడం ద్వారా విద్యార్థులు తరగతికి తగిన సామర్థ్యాలు అందుకోగలరన్నారు. దాని కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సమగ్ర శిక్ష ఏఎంవో చంద్రశేఖర్‌మాట్లాడుతూ పాల్ ల్యాబ్ ద్వారా పాఠశాలకు 30 ట్యాబ్‌లు, హెడ్ ఫోన్స్ తదితర మెటీరియల్ అందిస్తామని తెలిపారు. టైం టేబుల్‌లో వారానికి రెండు పీరియడ్‌లు కేటాయించి విద్యార్థులు సమగ్రాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఉంగరాల నాగేశ్వరరుఆవు, ఉపాధ్యాయులు వెంటక నరేంద్ర, రవీంద్ర, ప్రసాద్‌రెడ్డి, సతీష్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.


పాలకొల్లులో మాట్లాడుతున్న జస్బీర్ సింగ్ గిల్ (దింపా)

కాంగ్రెస్ బలోపేతానికి పాటుపడాలి

పాలకొల్లు అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి పూర్వవైభవం తీసుకురావడానికి ప్రతి కార్యకర్త, నాయకుడు పాటు పడాలని ఏఐసీసీ మెంబర్, నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడు జస్బీర్ సింగ్ గిల్ (దింపా) అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశంలో దింపా ముఖ్య వక్తగా విచ్చేసి మాట్లాడారు. ప్రతి కార్యకర్త ప్రజలతో మమ్మెకమ్మై పనిచేయాలన్నారు. ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గొగులమండ భాస్కరరావు, కో ఆర్డినేటర్ కొరగింజల హరికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆచంట:కాంగ్రెస్ పార్టీ ఎపుడూ కూడా ప్రజలకు దగ్గరగా ఉండి వారి అభివృద్ధికి పాటు పాడుతుందని దింపా అన్నారు. గురువారం ఆచంటలో పార్టీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమంలో భాగంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దింపా పాల్గొన్నారు. సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు పాతపాటి హరి కుమార్ రాజు, ఆచంట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నెక్కంటి సతీష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అశోక్ ధావల్

'కేంద్రానిది కార్పొరేట్ ప్రభుత్వం'

భీమవరం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ది కార్పొరేట్ ప్రభుత్వమని, కార్పొరేట్లకు రాయితీలిస్తున్నారు కానీ రైతుల ఆత్మహత్యలు నివారించలేకపోతున్నారని, నాడు వ్యవసాయ చట్టాలు, నేడు లేబర్ చట్టాలు మార్పు కార్పొరేట్లకోసమే అని అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షుడు అశోక్ ధావలే ఘాటుగా విమర్శించారు. గేరువారం స్థానిక ఏఎస్ఆర్‌నగర్‌లో ఉన్న అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో ఉద్ధరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతాంగ సమస్యలు, ప్రభుత్వాల బాధ్యత అనే అంశంపై సెమినార్‌కు మంతెన సీతారామ్ అధ్యక్షత వహించగా ఆయన ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఇక్కడ బాబు, అక్కడ మోదీ ఇద్దరూ 2047 విజన్ పేరుతో దేశంలో, రాష్ట్రంలో ఉన్న కార్పొరేట్లకు భూములు పంపిణీ చెయ్యాలని చూస్తున్నారన్నారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, ఉద్ధరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ కార్యదర్శి, రైతుసంఘం రాష్ట్ర నేత బి.బలరాం మాట్లాడారు.

రైతు భవనానికి నిధి అందజేత

ఢిల్లీలో నిర్మిస్తున్న రైతు భవనానికి రైతు కార్యాచరణ సమితి నేతలు పాతపాటి మురళీ రామరాజు, కలిదిండి గోపాలకృష్ణ రాజు, పేరిచర్ల లక్ష్మణ వర్మ, ఆర్.రఘురామరాజు నిధి అందించారు. ఉద్ధరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ తరఫున 50 వేల రూపాయలు చెక్కును ఫౌండేషన్ చైర్మన్, కార్యదర్శి, సభ్యులు చేతులమీదుగా అశోక్ ధావలే అందించారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు ప్రారంభం

పాలకోడేరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువత క్రీడల్లో సత్తా చాటేందుకు స్కూల్ గేమ్స్ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి అన్నారు. శృంగవృక్షం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి నెట్ బాల్ అండర్-14 బాలురు బాలికల పోటీలను గురువారం డీఈవో నారాయణతో కలిసి ఆయన ప్రారంభించారు. 13 జిల్లాల నుంచి సుమారు 390 మంది క్రీడాకారులు తరలి వచ్చారు.

పార్లమెంట్



పెదతాడేపల్లి జడ్పీ పాఠశాలలో మాక్ పార్లమెంట్

అసెంబ్లీ


భీమవరం ఝాన్సీ లక్ష్మీబాయి మునిసిపల్ హైస్కూల్‌లో మాక్ అసెంబ్లీ

ఆకట్టుకున్న విద్యార్థుల మాక్ పార్లమెంట్, అసెంబ్లీ

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి):పెదతాడేపల్లి జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులు నిర్వహించిన మాక్ పార్లమెంట్ సమావేశం ఆకట్టుకున్నది. ప్రతిపక్ష నాయకుల ప్రశ్నలు, అధికార పార్టీ నేతల సమాధానాలు అంశాల వారీగా విద్యార్థులు పార్లమెంటు పద్ధతులు, పనితీరు ప్రజలకు కళ్ళకు కట్టినట్టు చూపించారు. ఈ మాక్ పార్లమెంట్ ద్వారా విద్యార్థులకు ప్రభుత్వ విధానాలు, శాఖల సమన్వయం తదితర అంశాలు తెలుస్తాయని హెచ్‌ఎం షేక్ లాల్‌బీబీ పేర్కొన్నారు.

భీమవరం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భీమవరం టూటౌన్‌లోని ఝాన్సీ లక్ష్మీబాయి మునిసిపల్ హైస్కూల్‌లో విద్యార్థినులు మాక్ అసెంబ్లీ నిర్వహించారు. పిల్లలందరూ ఉత్సాహంగా పాల్గొని ప్రశ్నలతో ఆకట్టుకున్నారు. స్కూల్ హెచ్‌ఎం కె.కృష్ణకుమారి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు పిల్లల్లో సృజనాత్మకత పెరగడానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఉపాధ్యాయురాలు కాంచన రచించి, దర్శకత్వం వహించారు.

ఆడుతూ.. పాడుతూ

అంతర్ కళాశాలల వెటర్నరీ పాలిటెక్నిక్ పోటీలు

తుది దశకు చేరిన క్రీడలు

వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మూడు రోజులుగా జరుగుతున్న వెటర్నరీ పాలిటెక్నిక్ ఇంటర్ కళాశాలల క్రీడా, అథ్లెటిక్స్, సాంస్కృతిక పోటీలు తుది దశకు చేరుకున్నాయి. మూడు రోజులుగా వివిధ క్రీడల్లో విద్యార్థులు తమ ప్రతిభ కనబరుస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఈ పోటీలు తమకు ఎంతో ప్రత్యేకమని అభిప్రాయ పడుతున్నారు. రాష్ట్రంలో పది పాలిటెక్నిక్ కళాశాలల నుంచి వచ్చిన క్రీడాకారులు సరదాగా పోటీ పడుతూ ఈ పోటీ తమకు ఎంతో ప్రత్యేకం అంటున్నారు.

- తాడేపల్లిగూడెం రూరల్

క్రీడలంటే ఇష్టం



క్రీడలంటే నాకు ఎంతో ఇష్టం. అందుకే అంతర్ కళాశాలల పోటీలకు వచ్చాం. గతేడాది జరిగిన పోటీల్లో వాలీబాల్‌లో సెమిస్ వరకూ వెళ్లాం. ఈ సారి ఖోఖో పోటీల్లో మా గరివిడి జట్టు ఫైనల్‌లో విజేతగా నిలిచింది. ఎంతో ఆనందంగా ఉంది.

టి.పవన్, గరివిడి

పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది



మేం ఎంతో ఆనందంగా ఈ పోటీలకు హాజరయ్యాం. మిగిలిన కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులతో తమ కళాశాల విద్యార్థులు అంతా కలిసి పోటి పడటం మాలో నూతనోత్తేజం కలిగింది. ప్రస్తుతం పోటీల్లో వాలీబాల్‌లో విజేతలుగా నిలవడం ఎంతో ఆనందంగా ఉంది.

- జి.కృష్ణతేజస్విని, గరివిడి


టెన్నికాయిట్ ఆడుతున్న క్రీడాకారులు

ఎక్కువ పతకాలు సాధిస్తాం



మా జట్టు వాలీబాల్‌లో సెమిస్‌కు చేరుకుంది. ఈ పోటీల్లో మా పాలిటెక్నిక్ కళాశాల నుంచి ఎక్కువ పతకాలు సాధిస్తాం. ఇక్కడివాతావరణం, సౌకర్యాలు బాగున్నాయి.

- పి.వరుణ్, సదుం పాలిటెక్నిక్

విజేతగా నిలవాలని వచ్చాం



మేం అన్ని క్రీడల్లో శిక్షణ పొందాం. ఈ సారి అన్ని పోటీల్లో విజేతలుగా నిలవాలని సంకల్పంతో ఆడుతున్నాం. ప్రస్తుతం ఖోఖోలో విజేతలుగా నిలవడం ఎంతో ఆనందంగా ఉంది.

బి.అసిన్, బన్వాసి

పోటీల్లో సత్తాచాటుతాం



క్రీడా పోటీలు మా కళాశాల ప్రాంగణంలో నిర్వహించడం ఆనందంగా ఉంది. ఈ పోటీల్లో మా జట్టు టేబుల్ టెన్నిస్‌లో విజేతగా నిలిచాం. ఇంకా మిగిలిన పోటీలు గెలిచి ఈ పోటీలు ప్రత్యేకంగా చూసుకుంటున్నాం.

కె.భానుశ్రీ, వీఆర్‌గూడెం



నడకను ప్రారంభించిన కలెక్టర్ నాగరాణి

డీఎన్ఆర్‌లో పారా క్రీడలు ప్రారంభం


భీమవరం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): డీఎన్ఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పారా క్రీడలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గురువారం ప్రారంభించారు. తొలుత పారా క్రీడల కోసం అవగాహన నడకను జి ల్లా కలెక్టర్ పచ్చ జెండా ఊపి ప్రారంభించి, బధిర విద్యార్థులతో కలిసి నడిచారు. దివ్యాంగులను ఉత్సాహపరిచే విధంగా వారితో కలిసి స్వయంగా జిల్లా కలెక్టర్ క్రికెట్ ఆడి బ్యాటింగ్, బౌలింగ్ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు ఏరంగంలోను తీసిపోని విధంగా అన్ని రంగాల్లో పోటీ పడాలన్నారు. మీ సామర్థ్యం, మీ బలం మీకు తెలియదని వైకల్యం లేని వారి కంటే మీరు ఎంతో సమర్థులని పేర్కొన్నారు. మీ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయని, ఎన్నో అభివృద్ధి పథకాలతో పాటు ప్రోత్సాహాలను కూడా అందిస్తున్నాయన్నారు. బ్యాడ్మింటన్ సింగిల్స్ డబుల్స్, క్రికెట్, 100 మీటర్ల పరుగు పందెం, షాట్ పుట్ నాలుగు విభాగాల్లో పారా అథ్లెట్ల కోసం బాల, బాలికలకు క్రీడలను నిర్వహించడం జరుగుతుందన్నారు. వివిధ బధిర పాఠశాలల నుంచి సుమారు 80 మంది బాల, బాలికలు పారా క్రీడల్లోపాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి శాఖ అధికారి ఎం.మోహన్ దాస్, డీఎన్ఆర్ కళాశాల సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణ(బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, రామకృష్ణంరాజు, పీడీ బి.వి నరసింహారాజు, ఫిట్ జోన్ జిమ్ నిర్వాహకులు దాసరి చందు, భీమవరం వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కందుల సురేష్, తదితరులు పాల్గొన్నారు.



గోసంరక్షణశాల వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు

ద్వారకాతిరుమల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రాణ నష్టం జరిగిన తర్వాతే అధికారులు మేల్కొన్నారు. సెప్టిక్ ట్యాంక్‌లో పడి గిరి జాతి ఆవు మృతి చెందిన తర్వాత కళ్లు తెరచిన అధికారులు వాకింగ్ ట్రాక్‌కు సెప్టిక్ ట్యాంక్‌కు మధ్య రక్షణ చర్యలు చేపట్టారు. ఈక్రమంలో ఫెన్సింగ్‌ను నిర్మించారు. శ్రీవారి గోసంరక్షణశాలలోని ఇటీవల మూడు గోవులు అకాల మరణం పొందిన విషయం తెలిసిందే. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రెండు గోవులు విద్యుదాఘాతంతో మృతి చెందితే తాజాగా మరో గోవు సెప్టిక్ ట్యాంకులో పడి మృత్యుఒడికి చేరుకున్న విషయం తెలిసిందే. ఆవులు సంచరించే ప్రాంతంలో సరైన రక్షణలేక పోవడంతో పాటు శిథిలావస్థకు చేరిన ఈ ట్యాంక్ కారణంగా గిరి జాతికి చెందిన ఓ గోవు మృత్యువాత పడటం భక్తులను ఆవేదనకు గురిచేసింది. ఈ ఘటనలు జరిగిన తర్వాత మేల్కొన్న ఆలయ అధికారులు గురువారం వాకింగ్ ట్రాక్‌కు సెప్టిక్ ట్యాంక్‌కు మధ్యగా ఫెన్సింగ్‌ను వేసి రక్షణ చర్యలు తీసుకున్నారు.

టీ20 ఆంధ్ర క్రికెట్ టీమ్‌కు మునీష్‌వర్మ



ఏలూరు రూరల్, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ సయ్యద్ మస్తాక్ ఆలీ టీ20 ట్రోఫీ ఆంధ్ర టీమ్‌కి ఏలూరు కుర్రాడు మునీష్‌వర్మ ఎంపిక అయ్యాడు. ఏలూరుకి చెందిన బి.మునీష్ వర్మ గతంలో సెంట్రల్ జోన్ టోర్నమెంట్, ఆంధ్ర ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. ఈక్రమంలో బీసీసీఐ నిర్వహించే టీ 20 టోర్నమెంట్ ఆంధ్ర టీమ్ జట్టు సభ్యుడుగా మునీష్‌వర్మ ఎంపిక అయ్యాడు. వర్మ ఐపీఎల్‌కి కూడా ఎంపిక అవ్వాలని స్థానిక క్రికెటర్ల కోరుకుంటున్నారు.

స్పోర్ట్స్ కార్నర్

వచ్చే నెలలో పారా అథ్లెటిక్స్ పోటీలు

ఏలూరు అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు గల (సీడబ్ల్యుఎస్ఎన్)పిల్లలకు సబ్‌జూనియర్, జూనియర్ (అండర్-17, 20)విభాగాల్లో పారా అథ్లెటిక్స్ పోటీలు డిసెంబరు మొదటి వారంలో నిర్వహించడానికి సమగ్రశిక్ష విలీనవిద్య(ఐఈ)జిల్లా అధికారులు కార్యాచరణను రూపొందిస్తున్నారు. రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, క్లబ్‌త్రో ఈవెంట్లలో బాలబాలికలకు వేర్వేరుగా ఈ పోటీలు నిర్వహిస్తారు. జిల్లాకేంద్రంలో ఒకేరోజున నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. పోటీలను పరిశీలించేందుకు స్టేట్ అబ్జర్వర్లుగా పి.వనజ, వై.నరసింహంలను సమగ్రశిక్ష రాష్ట్ర అదికారులు నియమించారు. ఆయా ఈవెంట్లలో ప్రతిభ కనబరిచిన అథ్లెట్లను రాష్ట్రస్థాయి మీట్‌కు పంపేందుకువీలుగా ఏపీ పారా ఒలింపిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు పర్యవేక్షిస్తారు. అన్ని ఈవెంట్లలో తొలి మూడుస్థానాల్లో నిలిచిన విజేతలకు పతకం, ప్రశంసా పత్రాలను అందిస్తారు. పారా అథ్లెటిక్స్ జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనే సీడబ్ల్యుఎస్ఎన్ విద్యార్థులందరికీ టీషర్ట్‌లను పంపిణీచేస్తారు. ప్రభుత్వ యాజమాన్యంలోని అన్ని పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలల బాలబాలికందరూ(సీడబ్ల్యుఎస్ఎన్)పాల్గొనేందుకు అర్హత కల్పిస్తారు.

టీచర్లకు ఆటల పోటీలు

ఏలూరు అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించడానికి విద్యాశాఖ నిర్ణయించింది. పురుష టీచర్లకు క్రికెట్, మహిళా టీచర్లకు త్రోబాల్ పోటీలు జరుగుతాయి. నిర్ణీత షెడ్యూలుప్రకారం మండల స్థాయిలో ఈ నెల 29, 30తేదీల్లో ఈ పోటీలు జరగాల్సిఉండగా, నిర్వహణ బాధ్యతలు చూడాల్సిన స్కూలగేమ్స్ ఫెడరేషన్ జిల్లా ప్రతినిధులు వివిధ స్టేట్ టోర్నమెంట్లలో వున్నందున తేదీలను కొద్దిరోజుల్లో ఖరారుచేస్తారు. మండలస్థాయి విజేతలతో డివిజన్ పోటీలు, అక్కడి విజేతలతో డిసెంబరు 20, 21, 22 తేదీల్లో జిల్లాస్థాయి పోటీలు, జనవరి 2, 3, 4 తేదీల్లో రాష్ట్రస్థాయి ఆటల పోటీలను నిర్వహించనున్నారు. పోటీల నిర్వహణకు ప్రభుత్వం జిల్లాకు నిధులను విడుదల చేసింది.

ముగిసిన వాలీబాల్ పోటీలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

దెందులూరు, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ్య విశ్వ విద్యాలయ అంతర్ కళాశాలల మహిళల వాలీబాల్ పోటీలు ముగిశాయి. ముగింపు రెండవ రోజు వ్యాయామ కాలేజీలో జరిగింది. బుధవారం గోపన్నపాలెంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియాల్‌తో కలిసి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. మహిళా క్రీడాకారులు వారి పాదాలకు షూ లేకుండా ఉండటాన్ని గమనించిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గురువారం చింతమనేని ఛారిటబుల్ ట్రస్టు ద్వారా సొంత నగదు లక్ష రూపాయలతో 90 మందికి షూ, సాక్స్‌లను అందజేశారు. వారికి భోజన వసతి కల్పించారు. అనంతరం ఆదికవి నన్నయ్య యూనివర్శిటి తరుపున వాలీబాల్ మహిళ జట్టుకు 20 మందిని ఎంపిక చేశారు. వారికి వారం రోజుల పాటు శిక్షణ ఇచ్చి 12 మందిని ఎంపిక చేయడం జరుగుతుందని వారిని చెన్నైలో అంత రాష్ట్ర వాలీబాల్ పోటీలు డిసెంబర్ 15 తేదీన జరిగే పోటిల్లో ఎంపికైన వారు పాల్గొంటారని ప్రిన్సిపాల్ నతానియాల్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు చింతా సుబ్బారావు, మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు, తోట రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ వై.పొలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు



జూడో పోటీలకు శనివారపుపేట విద్యార్థులు

ఏలూరు రూరల్, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి జూడో పోటీలకు శనివారపుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో అండర్ 14 బాల బాలికల పోటీల్లో ఎం. అభిరామ్, డి.గౌరీశ్వరరావు, పి.జస్వంత్‌కుమార్, డి.జాన్సన్, ఎ. తులసీ తరుణ్‌కుమార్, బి.భరత్‌కుమార్, సుంకర మోహన శివకృష్ణ, సీహెచ్ జయ రమ్యశ్రీ, డి.స్వాతి, ప్రతిభ కనబరిచారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం సిగిచర్లలో ఈనెల 28 నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు వీరిని ఎంపిక చేశారు.


స్వామినాయుడుని అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్

ఈత పోటీల్లో శ్రీసూర్య విద్యార్థికి ఐదు స్వర్ణాలు

ఏలూరు రూరల్, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): ఇటీవల విశాఖపట్నంలో జరిగిన సౌత్‌జోన్ స్టేట్ మీట్ ఈత పోటీలలో తంగెళ్ళమూడి శ్రీసూర్య పాఠశాల విద్యార్థి బలగ స్వామినాయుడు ఐదు స్వర్ణ పతాకాలు సాధించాడని స్కూల్ డైరెక్టర్ కొండపల్లి చంద్రశేఖర్‌రావు తెలిపారు. దేశం తరుపున ఒలంపిక్స్‌లో పతకం సాధించాలన్నదే తన లక్ష్యమని స్వామినాయుడు పేర్కొన్నారు. అలాగే స్వామినాయుడు సోదరి భార్గవి కూడా ఇదే పోటీలలో కాంస్య పతకం సాధించడం విశేషం.

వరి కోత మిషన్ల కొరత

నష్టపోతున్నామని రైతుల ఆవేదన


బర్రింకలపాడు వద్ద ఎండి పోతున్న వరిచేను

జీలుగుమిల్లి, నవంబరు 27 : (ఆంధ్రజ్యోతి) : కష్టపడి వరి పండించిన రైతులకు సరైన సమయంలో కోతలు జరక్క నష్టాల పాలవుతున్నారు. ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా ఉండటంతో కోత మిషన్‌లు దొరక్క పంట కోతల సమయం దాటి పంట నేలపాలవుతుందని, వరి కంకులు ఎండిపోయి ధాన్యం గింజలు రాలిపోతున్నాయని తాటియాకులగూడెం రైతులు వాపోతున్నారు. మరోవైపు కోత మిషన్ ఏజెంట్‌లు కుమ్మక్కై పంట కోతలకు ఇతర ప్రాంతాల నుంచి మిషన్‌లు రాకుండా కట్టడి చేస్తున్నారు. దీంతో గంటలకు టైర్ మిషన్‌కు రూ.2500, చైన్‌మిషన్‌కు రూ.4000 వేలు చొప్పున రైతుల నుంచి వరికోత కిరాయి వసూలు చేస్తున్నారు. మరో వైపు ఒక ఎకరంలో వరి పండిచిన రైతులు వరి కోత మిషన్ కోసం పడిగాపులు పడాల్సి వస్తోంది. వారం పది రోజులపాటు మిషన్‌ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. చెరువులు కాలువల ఆయకట్టు ప్రాంతంలో వరి పండించిన రైతులు ఆయా నెలల్లో తేమ శాతం ఉండటంతో వరికోత మిషన్‌లు రాక మరో పంట (రెండో పంట) వేసేందుకు అదును దాటి పోతుందని వాపోతున్నారు. వరికి గిట్టు బాటు ధర కల్పించి ఆర్ఎస్‌కెల ద్వారా పంటను కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం సకాలంలో పంట కోతలు జరిగేలా చూడాలని రైతులు వేడుకుంటున్నారు.

గేటు పడినా.. ఆగేదేలే!

రైల్వే గేట్ల వద్ద ఆతృత.. ప్రాణాలకే ముప్పు

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలోని రైల్వే గేట్ల వద్ద రెండేళ్లల్లో దాదాపు 82 మంది మృతి


ఉండి రోడ్డులో రైలు గేటు పడుతుండగానే కింద నుంచి వెళ్లి పోతున్న వాహనదారులు


భీమడోలులో రైలు గేటు కింద నుంచి వస్తున్న మహిళలు



పవర్‌పేట వద్ద రైల్వే గేటు వేస్తున్నా ఆగని ప్రయాణికులు


ఆకివీడులో రైలు వెళుతున్న సమయంలో రైల్వేగేటు దూకి పట్టాలు దాటుతున్న యువకులు



పవర్‌పేట వద్ద గేటు వేస్తున్నా ఆగని ఆటోలు

ఏలూరు క్రైం/ భీమవరం క్రైం/ ఆకివీడు /భీమడోలు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రైల్వే గేట్లు ఉన్నా వాటిని వేయడానికి ఉన్న సిబ్బంది నిత్యం పడుతున్న నరకయాతన అంతా ఇంతా కాదు. వారు సైరన్ కొడుతూ గేటు వేసే ప్రయత్నం చేస్తుంటే ఎవరో ఒకరు వాహనదారులు వచ్చేస్తున్నారు. వారిని పంపించడానికి గేటు కాస్త పైకి ఎత్తితే మరొకరు వచ్చేస్తున్నారు. ఈ లోపు వేగంగా రైలు రానే వచ్చేస్తుంది. కొన్ని ప్రాంతాల్లో రైల్వే గేటు వేసి ఉన్నా వాటి కిందనుంచి వాహనాలను వాలుగా వంచి వెళ్ళిపోతున్నారు. ఇలాంటి సమయంలో కూడా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఏలూరు జిల్లాలో అత్యధికంగా ఏలూరు వపర్‌పేట గేటు, భీమడోలు గేటు, నూజివీడు గేటు వద్దే ప్రమాదాలు జరుగుతున్నాయి. గత ఏడాది రైలు ప్రమాదాల్లో 22 మంది మరణించగా 12 ప్రమాదాలు గేటు వద్ద జరిగి 12 మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 25 మంది రైలు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోగా రైల్వే గేట్ల వద్ద జరిగిన ప్రమాదాల్లో 15 మంది మృత్యువాతపడ్డారు. పశ్చిమగోదావరి జిల్లాలో గవర్నమెంట్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో గత రెండేళ్లల్లో రైల్వే గేట్ల వద్ద 55 మరణాలు సంభవించాయి. భీమవరం, తణుకు, నరసాపురం, కైకలూరు తదితర రైల్వే స్టేషన్ల ప్రాంతాలు ఈ పరిధిలో ఉన్నాయి.

- ఆకివీడు రైల్వే స్టేషన్‌లో రైళ్లు వెళ్ళడానికి రెండు ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. రైల్వేగేటు వేసి ఉన్న సమయంలో ఒక ప్లాట్‌ఫాం నుంచి రైలు వెళుతుండగానే గేటు దాటుకొని కొందరు రెండవ ప్లాట్‌ఫాం మీద నుంచి వెళుతున్నారు. ఒక పట్టా పై రైలు వెళుతుండగా వేరే పట్టాలపై నడుస్తున్న సమయంలో ఆ పట్టాపై కూడా రైలు వస్తే అనుకోకుండా ప్రమాదం జరుగుతుంది.
- భీమడోలు రైల్వేగేటు నుంచి ద్వారకాతిరుమల, కొవ్వూరు, రాజమండ్రితోపాటు తాడేపల్లిగూడెం వైపు నిత్యం వేల సంఖ్యలో వాహనాలు, ప్రయాణిస్తుంటాయి. దీంతో గేటు పడిన సమయంలో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ నిలిచిపోతుంది. రైల్వే గేటు వేసిన సమయంలో చిన్న వాహనాలు గేటు కింద నుంచి వెళ్ళడం, ప్రజలు గేటు కింద నుంచి ట్రాక్ దాటడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈవే ప్రమాదాలకు దారితీస్తున్నాయి.

క్షణం తీరికలేని జీవితం. ఉన్న సమయంలోనే ఉరుకులు, పరుగులు. ఆలోచన లేని ప్రయాణాలు. గతంలో ఏకాగ్రతతో ప్రయాణం చేసేవారు. కానీ నేడు ఒంటరిగా వాహనంపై ప్రయాణం చేసినా సెల్‌ఫోన్ మహత్యమా అని ఊహల్లోనూ, మాటల్లోనూ ఎక్కడికో తేలిపోతూ ఎదురు ఉన్న ప్రమాదాలను పసిగట్టలేక ప్రాణాలే కోల్పోతున్నారు. ఇలాంటి ప్రమాదాలు నిత్యం ఎక్కడో చోట జరుగుతూనే ఉన్నాయి. ఒక నాడు రైళ్ళు బొగ్గు ఇంజన్లతోనూ, ఆతరువాత డీజిల్ ఇంజన్లతోనూ నడిచేవి. అవి వేగం తక్కువతోనే ఎక్కువ శబ్దంతోనూ నడిచేవి. కానీ నేడు టెక్నాలజీ అభివృద్ధితో విద్యుత్ రైళ్ళు నిశ్శబ్దంగా అత్యంత శక్తివంతమైన వేగంతో ప్రయాణిస్తున్నాయి. రైళ్ళు ప్రస్తుతం 120 కిమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్నాయి. పట్టాలు దాటేలోపే ఆ రైళ్ల దాటే వారి మీద నుంచి వెళ్ళిపోతున్నాయి

‘నకిలీ సర్టిఫికెట్లు లేవు.. లక్ష్మయ్య ఆరోపణలు దుర్మార్గం’

ఏలూరుటూటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో పశుసంవర్ధక శాఖ సహాయకుల సర్టిఫికెట్లలో ఎటువంటి తేడాలు లేవని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నాన్‌గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్ ఫెడరేషన్ చైర్మన్ ఎం.గణేశ్ అన్నారు. ఏలూరు వెటర్నరీ జేడీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సచివాలయ పశుసంవర్ధక శాఖ సహాయకులు రాష్ట్ర వ్యాప్తంగా 1200మంది నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందారని రాష్ట్ర వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ బీవీ.లక్ష్మయ్య చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. ఆ ప్రకటన వెటర్నరీ అసిస్టెంట్ల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. ఆరేళ్ల క్రితం ప్రభుత్వం పోటీ పరీక్ష నిర్వహించిన తరువాత కలెక్టర్ ఆదేశాల మేరకు పశుసంవర్ధక శాఖ అధికారులతో సర్టిఫికెట్లు పరిశీలించిన తరువాత ఉద్యోగాలు ఇచ్చారన్నారు. ఈ సమయంలో డాక్టర్ లక్ష్మయ్య వెటర్నరీ అసిస్టెంట్లపై తీవ్ర ఆరోపణలు చేయడం దుర్మార్గమని, అతడిపై పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. లేనియెడల ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సెక్రటరీ ఎం.బాబూరావు, ఏహెచ్‌ఏ అసోసియేషన్ అధ్యక్షులు కిషోర్, వీఎల్‌వో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఫణికుమార్ పాల్గొన్నారు.

రేపు బొర్రంపాలెంలో ఫుడ్ ఫెస్టివల్

ఏలూరు అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):పోషక విలువలతో కూడిన ఆహారోత్పత్తులను మధ్యాహ్నభోజన పథకంలో భవిష్యత్తులో ప్రవేశపెట్టే సన్నాహాల్లో భాగంగా ఈనెల 29న టి.నరసాపురం మండలం బొర్రంపాలెం జడ్పీ హైస్కూలులో ఫుడ్ ఫెస్టివల్ కం ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నారు. ఇటీవల సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో వృత్తి విద్యాకోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఏలూరులో నిర్వహించిన పోటీల్లో బొర్రంపాలెం జడ్పీ హైస్కూలు విద్యార్థులు ఫుడ్ ప్రాసెసింగ్ విభాగంలో ప్రదర్శనకు పెట్టిన ఆహారోత్పత్తులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. పూర్తిగా చిరు ధాన్యాలతో తయారు చేసిన ఈ ఆహారోత్పత్తులనే రాష్ట్రమంతటా పరిచయం చేసేందుకు ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఒకేషనల్ విద్య బోధిస్తున్నచోట విద్యార్థులతో శనివారం ఫుడ్ ఫెస్టివల్ కం ఎగ్జిబిషన్‌ను నిర్వహించాలని గురువారం విద్యాశాఖ మధ్యాహ్న భోజన పథకం విభాగం రాష్ట్ర ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్సులో ఆదేశించారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారంపై అవగాహన

ఫుడ్ ఫెస్టివల్‌లో వంటనూనె, పంచదార, మైదా లేకుండా డ్రైఫ్రూట్స్, పండ్లు, చిరుధాన్యాలతో లడ్డూ, హల్వావంటివి తయారు చేయాల్సి ఉంటుంది. బెల్లం, నెయ్యి వంటివి ఉపయోగించవచ్చు. స్కూలు ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసే కౌంటర్లలో విద్యార్థులే స్వయంగా విభిన్న రకాల ఆహార పదార్థాలను అందరి ఎదుట ప్రత్యక్షంగా తయారుచేస్తారు. దీనివల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆరోగ్యకరమైన నాణ్యతతో కూడిన పౌష్టికాహారంపై అవగాహన ఏర్పడుతుందని విద్యాధికారులు వివరించారు. మొత్తం ఐదు రకాల ఆహారపదార్థాల తయారీకి అవసరమైన ముడి సరుకుల కోసం రూ.6 వేలను సమగ్రశిక్ష మంజూరుచేసింది. ఫుడ్ ఫెస్టివల్‌ను తిలకించేందుకు మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర అధికారుల బృందం, పాఠశాల విద్య కాకినాడ ఆర్జేడీ, జిల్లా విద్యాధికారులు హాజరవుతారు.

హీరోహోండా షోరూమ్ అధినేత ‘వంటెద్దు’ మృతి


సోమసుందరావు (ఫైల్)

తణుకు, నవంబరు27(ఆంధ్రజ్యోతి):తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ మోటారు వ్యాపారవేత్త, హీరోహోండా షోరూమ్ వ్యవస్థాపక అధినేత వంటెద్దు సోమసుందరరావు (77) గురువారం పైడిపర్రులోని ఆయన నివాసంలో మృతి చెందారు. ఆయన భార్య ధనకస్తూరిబాయి గతంలోనే మృతి చెందారు. కుమారుడు వంటెద్దు రాజా ప్రస్తుతం టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. కుమార్తె పుత్సల కాశీ అన్నపూర్ణదేవి, మనుమడు వంటెద్దు వెంకట్, మనుమరాండ్రు ఉన్నారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో ఉంటూ ఇంటి వద్దే వైద్య సేవలు అందుకుంటున్నారు. ఆయన తండ్రి వంటెద్దు సుబ్బారావు కాంగ్రెస్ పార్టీ తణుకు పట్టణ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, మాజీ ఎమ్మెల్యే ముళ్ళపూడి వెంకట కృష్ణారావు, ఏఎంసీ చైర్మన్ కొండేటి శివ, టీడీపీ నాయకులు డాక్టర్ దొమ్మేటి వెంకటసుధాకర్, బసవా రామకృష్ణ, పరిమి వెంకన్నబాబు, కలగర వెంకటకృష్ణ, ఒమ్మి రాంబాబు, మంత్రిరావు వెంకటరత్నం, తాతపూడి మారుతీరావు, గుమ్మళ్ళ హనుమంతరావు సంతాపం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ఎరువుల షాపులో విజిలెన్స్ తనిఖీలు


ఎరువుల షాపులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

చాట్రాయి, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి): చాట్రాయిలోని ఓ ప్రైవేటు ఎరువులు పురుగు మందుల షాపులో గురువారం సాయంత్రం విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్సై కే నాగరాజు, ఏవో మీరయ్య ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలలో మొక్కజొన్న విత్తనాల నిల్వలలో వ్యత్యాసం ఉండటంతో రూ. 3.90 లక్షల విలువైన 6.86 క్వింటాళ్ళ మొక్కజొన్న విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేసి, నిత్యావసరాల చట్టం-1955 యాక్ట్ ప్రకారం 6ఏ కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎస్సై నాగరాజు తెలిపారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు ఖచ్చితంగా బిల్లులు తీసుకోవాలని విజిలెన్స్ ఎస్సై కోరారు. తనిఖీలలో చాట్రాయి ఏవో శివశంకర్ పాల్గొన్నారు.

నాలుగు లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని ధర్నా



ఏలూరు కార్పొరేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు హాని చేసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ గురువారం స్థానిక వసంతమహల్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. కార్మికులకు, రైతాంగానికి, వ్యవసాయ కూలీలకు, ప్రజలకు నష్టం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామకృష్ణ, కె.శ్రీనివాస్, పిచ్చుక ఆదిశేషు, ఇస్సాకు, కోటేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో ప్రధానమైన 29 చట్టాలను రద్దు చేసి కార్పొరేట్‌లు, పెట్టుబడిదారి యజమానులకు మేలు చేసే విధంగా మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకున్నదన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను వదిలేసి ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచుతూ అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం తీర్మానం చేయడం దుర్మార్గమన్నారు. యావత్ కార్మిక లోకానికే తీరని అన్యాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వై.ఎస్.కనకారావు, జె.గోపి, అరుణకుమారి, జి.కోటేశ్వరరావు, చింతాడ లక్ష్మి, మీసాల సత్యం, జి.యేసుబాబు, సి.హెచ్.అమర్‌కుమార్, ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

‘నూజివీడు’ను ఎన్టీఆర్ జిల్లాలో కలపాలి

» జేఏసీ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు



నూజివీడులో నిరసన దీక్ష చేస్తున్న జేఏసీ నాయకులు

నూజివీడు టౌన్, నవంబరు27(ఆంధ్రజ్యోతి):నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని నూజివీడు జేఏసీ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టారు. గురువారం ఈ దీక్షలను నూజివీడు జేఏసీ గౌరవ అధ్యక్షుడు చలసాని వెంకటరామారావు, కేడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ కొమ్మన నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా చలసాని రామారావు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని, గతంలో కరోనా కాలంలో ఎన్నో పోరాటాలు చేశామని, గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లాల పునర్విభజనలో నూజివీడును ఏలూరు జిల్లాలో కలపడాన్ని వ్యతిరేకిస్తూ ఏడాదిపాటు పెద్దఎత్తున ప్రజా పోరాటం చేశామన్నారు. దీనిలో భాగంగా ధర్నాలు, నిరాహార దీక్షలు, 72 గ్రామాల్లో జీపు యాత్రతోపాటు లక్ష కరపత్రాల పంపిణీ, 25 వేల సంతకాల సేకరణ, ప్రజా బ్యాలెట్ నిర్వహించి నూజివీడు నుంచి విజయవాడకు పాదయాత్రగా వెళ్లి అప్పటి కలెక్టర్‌కు వినతిపత్రం అందించామన్నారు. నూజివీడు జేఏసీ అధ్యక్షుడు మరిదు శివరామకృష్ణ, నూజివీడు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్ మాట్లాడుతూ గతంలో ప్రతిపక్షనేతగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2023లో అంబేడ్కర్ జయంతి సందర్భంగా నూజివీడు వచ్చినప్పుడు, 2024 ఎన్నికల ప్రచార సభకు వచ్చినప్పుడు బహిరంగ సభలో హామీ ఇచ్చారన్నారు. నూజివీడు ప్రజల ఆకాంక్షలు ఇక్కడ పుట్టి పెరిగిన వారికి మాత్రమే తెలుస్తాయని, దీనికి భిన్నంగా ఎవరు వ్యవహరించినా ప్రజల ఆగ్రహా నికి గురికావడం తప్పదన్నారు. ఇప్పటికైనా సానుకూలంగా నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కలిపి పూర్వవైభవం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పీపుల్స్ ఫోరం నాయకులు పిన్నమనేని కుమార్, సబ్బినేని శ్రీనివాస్, సిద్దార్థ రవి, రాజశేఖర్, ఫరూక్, నూజివీడు జేఏసీ కోశాధికారి చాట్ల పుల్లారావు, జేఏసీ నాయకులు ఎం.సునీల్‌కుమార్, ఎర్రంశెట్టి రాము, నూజివీడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నవ రమేష్ తదితరులు పాల్గొన్నారు.


కైకలూరులో పెట్రోలు బంకును ప్రారంభిస్తున్న అంజనీకుమార్‌యాదవ్

పెట్రోలు బంకులతో జైళ్లశాఖ బలోపేతం

» జైళ్లశాఖ డీజీపీ అంజనీకుమార్ యాదవ్

కైకలూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి):పెట్రోలు బంకుల నిర్వహణ వల్ల జైళ్లశాఖ ఆర్థికంగా బలోపేతం అవుతుందని, తద్వారా ఆదాయ వనరులను సమకూరుస్తున్నామని రాష్ట్ర జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ అంజనీకుమార్ యాదవ్ అన్నారు. గురువారం కైకలూరు సబ్‌జైల్ ప్రాంగణం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన హెచ్‌పీ పెట్రోలు బంకును ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 23 పెట్రోలు బంకులను జైళ్ల శాఖ ద్వారా ఏర్పాటు చేశామని వీటిని ఆదర్శంగా తీసుకుని ఇతర రాష్ట్రాల్లో పెట్రోలు బంకుల నిర్మాణాన్ని చేపట్టిందన్నారు. ఖైదీల్లో నైపుణ్యాభివృద్ధి పెరుగుతుందని సమాజసేవ కేంద్రాలుగా మార్చేందుకు దోహదపడుతుందన్నారు. జైళ్లలో ఖైదీల శిక్షాకాలంలో ఇలాంటి వాటిపై నైపుణ్యత సాధించి సమాజంలో తిరిగి కలిసిపోవడానికి మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమాలలో జైళ్లశాఖపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం ఏర్పడుతుందని, పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా సంస్కరణాత్మక సామాజిక సంక్షేమ కార్యక్రమాలు బలపడతాయన్నారు.

అనంతరం రూ.1.90 కోట్లతో నిర్మాణం చేసే కైకలూరు సబ్‌జైలును పరిశీలించారు. పనుల నిర్వహణలో కాంట్రాక్టరు టైల్స్ వేయకుండా ఫ్లోరింగ్ చేయడంపై అసహనాన్ని వ్యక్తం చేశారు. టెక్నాలజీ పెరుగుతున్న రోజుల్లో జైళ్ళల్లో కూడా మార్పులు తీసుకువచ్చామని ఫ్లోరింగ్ అంతా టైల్స్ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. గుంటూరు రేంజ్ జైళ్లశాఖ డీజీపీ డాక్టర్ వరప్రసాద్, విజయవాడ సబ్‌జైల్ అధికారి ఎస్.శివశంకర్, ఏలూరుజిల్లా జైల్ సూపరింటెండెంట్ స్వామి, మచిలీపట్నం జిల్లా జైల్ సూపరింటెడెంట్ పిల్లా రమేష్, కృష్ణాజిల్లా సబ్‌జైల్ అధికారి ఉమామహేశ్వరరావు, కైకలూరు సబ్‌జైల్ సూపరింటెండెంట్ బొత్స అప్పారావు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థుల కోసం
వంద రోజుల కార్యాచరణ !

» టెన్త్ సబ్జెక్ట్ టీచర్లకూ రేటింగ్ ! » అవసరమైతే ఆదివారాల్లోనూ ‘పది’ ప్రత్యేక తరగతులు

ఏలూరు అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్న బాల బాలికలకు డిసెం బరు 6 నుంచి వరుసగా 100 రోజులపాటు నిర్వహించనున్న ప్రత్యేక తరగ తుల మాదిరిగానే ప్రాథమిక పాఠశాలల విద్యా ర్థులకు కూడా వందరోజుల కార్యాచరణను అదేరోజు నుంచి ప్రారంభించనున్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న బాలబాలికలు లాంగ్వేజి, గణితం సబ్జెక్టుల్లో కనీస సామర్థ్యాలు సాధిస్తున్నదీ, లేనిదీ తెలుసుకునేందుకు పాఠశా లల వారీగా ప్రస్తుతం జరుగుతోన్న ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) సర్వే ఫలితాల ఆధారంగా ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులకు అదనపు తర్ఫీదునిచ్చేందుకే వందరోజుల కార్యాచరణను నిర్దేశించారు. పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల కార్యాచరణలో రోజూ ఉదయం, సాయంత్రం ఒక గంటచొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహించడం కాకుండా, ప్రాథమిక తరగతులకు సంబంధించి చదువులో వెనుకబడినట్టుగా ఎఫ్ఎల్ఎన్ సర్వేలో గుర్తించిన బాలబాలికలకు ప్రత్యేక తర్ఫీదును నిర్ణీత బడి సమయంలోనే ఇవ్వాల్సి ఉంటుంది. మొత్తం మీద విద్యార్థి ఐదో తరగతి చదువు ముగించుకుని పాఠశాలను విడిచి పెట్టేలోగా లాంగ్వేజి సబ్జెక్టులు, గణితంలో చదవడం, రాయడం సామర్థ్యాలు సాధించేలా చేయడమే ప్రాథమిక తరగతుల విద్యార్థులకు వందరోజుల కార్యాచరణ ప్రణాళిక ముఖ్య ఉద్దేశమని అధికారులు వివరించారు.

సబ్జెక్టుల వారీగా టీచర్లకు రేటింగ్ !


పదో తరగతి పరీక్షల ఫలితాల ఆధారంగా సబ్జెక్టుల వారీగా టీచర్లకు ర్యాంకు/రేటింగ్ ఇవ్వనున్నారు. ఇప్పటివరకు అమల్లోవున్న విధానం ప్రకారం టెన్త్ ఉత్తీర్ణతలో జిల్లాలకే ర్యాంకులుండేవి. ఇక మీదట జిల్లా ఉత్తీర్ణతా శాతాన్ని సగటుగా తీసుకుని, దానిని సబ్జెక్టుల వారీగా టీచర్లకు ప్రామాణికంగా తీసుకుని రేటింగ్/ర్యాంకు ఇస్తారని విద్యాశాఖవర్గాలు తెలిపాయి. టెన్త్ పరీక్షార్థులకు డిసెంబరు ఐదో తేదీలోగా సిలబస్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ పూర్తి చేయాల్సిందేనని, అవసరమైతే ఆదివారాల్లో సైతం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఆ మరుసటి రోజు నుంచే అంటే డిసెంబరు 6 నుంచి ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు వంద రోజులపాటు నిర్వహించేలా కార్యాచ రణను ప్రారంభిస్తారు. కార్యాచరణ ప్రారం భానికి ముందే విద్యార్థులను సామర్థ్యాలకు అనుగుణంగా నాలుగు గ్రూపులుగా విభజిస్తారు. ఏ, బీ గ్రూపుల విద్యార్థులను షైనింగ్ స్టార్స్‌గాను, సి, డీ గ్రూపుల విద్యార్థులను రైజింగ్ స్టార్స్‌గాను విభజించి తర్ఫీదునిస్తారు.

ఆంధ్రాలో ఆక్వాసాగు భేష్



మండవల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రాలో ఆక్వాసాగు భేష్‌గా ఉందని ఝార్ఖండ్ రైతులు తెలిపారు. మండవల్లి మండలం చింతపాడులో గురువారం రొయ్యలు చేపల సాగును ఝార్ఖండ్‌లోని బొకారో జిల్లాకు చెందిన 16 మంది రైతులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. చేపలు, రొయ్యలు ఎంతకాలంలో పెరుగుతాయి? లాభనష్టాలు తదితర వివరాలను రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు.

శ్రీవారి అంతరాలయ దర్శనం పునఃప్రారంభం



ద్వారకా తిరుమల, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి): కరోనా మహమ్మారి ప్రవేశం తర్వాత దాదాపు ఐదేళ్ల అనంతరం ద్వారకాతిరుమల వేంకటేశ్వరాలయంలో అంతరాలయ దర్శనాన్ని అధికారులు గురువారం పునఃప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రతీ భక్తునికి అంతరాల య దర్శనం నిమిత్తం టిక్కెట్టు రుసుమును రూ. 500గా అధికారులు నిర్ణయించి అమలు చేశారు. భక్తులు అంతరాలయం ద్వారా స్వామివారి మూల విరాట్‌ను దర్శించుకునేందుకు ఉవ్విళ్లూరారు. ఈక్రమంలో ప్రారంభం రోజైన గురువారం 610 మంది అంతరాలయ దర్శనం టిక్కెట్లు తీసుకున్నట్టు ఆలయ ఈవో సత్యనారాయణమూర్తి తెలిపారు.


గోపవరంలో కౌన్సెలింగ్ చేస్తున్న అధికారులు

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

ముసునూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ముసునూరు మండలం గోపవరంలో బాల్య వివాహాన్ని గురువారం అధికారులు అడ్డుకున్నారు. 15 ఏళ్ల యువతికి, 22 ఏళ్ల యువకుడికి వివాహం జరుగుతుందని హెల్ప్‌లైన్ నంబరుకు వచ్చిన సమాచారం రావడంతో హెల్ప్‌లైన్ జిల్లా కో-ఆర్డినేటర్ రవికుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. యువతికి, ఆమె తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు చేసిన, పోత్సహించిన చట్ట రీత్యా నేరమని అధికారులు హెచ్చరిం చారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ సంధ్యారాణి, అంగన్‌వాడీ కార్యకర్త, ఆశావర్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాగి వైర్ల చోరీ ముఠా అరెస్ట్

ముఠాలో ఇద్దరు మహిళలు


నిందితులను అరెస్టు చేసి విలేకరులకు వివరాలు చెబుతున్న ఏఎస్పీ సుస్మిత

జంగారెడ్డిగూడెం,నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగివైరు చోరీ చేస్తున్న ఐదుగురు నిందితులను తడికలపూడి పోలీసులు అరెస్ట్ చేశారు. జంగారెడ్డిగూడెం సర్కిల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ సుస్మిత రామనాధన్ కేసు వివరాలు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పరిసర ప్రాంతాలకు చెందిన కెల్లా దుర్గా ప్రసాద్, షేక్ హిమత్, దేవకోటి రాజేశ్, కండెల జ్యోతి, వరంగల్ జిల్లాకు చెందిన కూరాకుల పద్మ కారులో వెళ్తుండగా తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు కామవరపుకోట మండలం రావికంపాడు వద్ద గురువారం అరెస్ట్ చేసి వారి నుంచి రెండు కార్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్టయిన ఐదుగురు నిందితులతో పాటు పాల్వంచకు చెందిన కోటగట్టు నాగరాజు కలిసి ముఠాగా ఏర్పడి కామవరపుకోట మండలం రావికంపాడు శివారులోని లిఫ్ట్ ఇరిగేషన్‌కు చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైరు దొంగిలించడానికి ఈ నెల 24 వ తేదీ రాత్రి కియా కారు, టయోటా కారులో వచ్చారు. ఈ క్రమంలో మిగిలిన ఐదుగురు వ్యక్తులు విద్యుత్ పాస్ అవుతుందని తెలిసి కూడా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పైకి కోటగట్టు నాగరాజును ఎక్కించారు. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ వైర్లు తప్పించే క్రమంలో నాగరాజు విద్యుత్ షాక్‌కు గురై కింద పడిపోయాడు. ముఠా సభ్యులు హుటాహుటిన కారులో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చేర్పించగా అప్పటికే నాగరాజు మృతి చెందాడని తెలుసుకుని నాగరాజు మృతదేహాన్ని ఆసుపత్రిలోనే విడిచి పరారయ్యారని ఏఎస్పీ తెలిపారు. ప్రమాదమని తెలిసినా నిర్లక్ష్యంగా వ్యవహరించి నాగరాజు మృతికి కారణమైన ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి జంగారెడ్డిగూడెం సీఐ ఎంవి.సుభాష్ దర్యాప్తు చేసినట్లు తెలిపారు. నిందితుల్లో ఏ-1 కెల్లా దుర్గా ప్రసాద్‌పై తెలంగాణలోని పాల్వంచ, ఎడ్లబయ్యారం పీఎస్‌లలో 13 కేసులున్నాయని, ఏ-4 కండెల జ్యోతి, ఏ-5 కూరాకుల పద్మలపై మెదక్‌లో ఒక కేసు ఉందని తెలిపారు.

గుండాట ఆడుతున్న ఐదుగురి అరెస్టు

టి.నరసాపురం, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి) : గుండాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఎం.జయబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తెడ్లం గ్రామంలో గుండాట ఆడుతున్నారనే సమాచారంతో తన సిబ్బందితో గురువారం దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 3500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ


ధ్వంసమైన లారీ ముందు భాగం

ద్వారకాతిరుమల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూర్యచంద్రరావుపేట వద్ద గురువారం ఉదయం తౌడు లోడుతో వెళ్తున్న లారీ ఆర్టీసీ బస్సును తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ ముందుభాగం పూర్తిగా ధ్వంసం అయ్యింది. అయితే నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై ప్రమాద సమయంలో వాహనాలు లేవు. దీంతో ప్రాణనష్టం తప్పినట్లయ్యింది. అలాగే తప్పించబోయిన ఆర్టీసీ బస్సును ఈ లారీ ఢీకొని ఉన్నా పెనుప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు అంటున్నారు. తణుకుకు చెందిన లారీ తౌడులోడుతో వరంగల్ నుంచి తణుకులోని ఓ ఫ్యాక్టరీకి వెళ్తోంది. ఘటనా స్థలమైన సూర్యచంద్రరావుపేట వద్దకు వచ్చేసరికి ఆర్టీసీ బస్సును తప్పించబోయిన లారీ డ్రైవర్ వేగంగా డివైడర్‌ను ఢీకొట్టాడు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి

డీఎస్పీ శ్రావణ్ కుమార్



ఏలూరు క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వ్యాపార సంస్థలు, చిన్న మధ్య తరగతి వ్యాపార సంస్థలు తప్పనిసరిగా సీసీ కెమెరా లు ఏర్పాటు చేయాలని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ సూచించారు. పబ్లిక్ సేఫ్టీ (మెజర్స్) ఎన్‌ఫోర్స్‌మెంట్‌యాక్టు 2013 ప్రకారం నోడల్ అధికారి అయిన ఏలూరు డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో పలు సూచనలు వ్యాపారస్తులకు తెలిపారు. వ్యాపార సంస్థలు, హోటళ్ళు, సినిమా హాల్స్ మాల్స్, చిన్న మధ్య తరగతి వ్యాపార సంస్థలు, వాటి యజమానులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాకుండా గృహ యజమానులు వారి ఇళ్లను అద్దెకు ఇచ్చే సమయంలో వలస కార్మికుల వివరాలు, అద్దెకు ఇచ్చే వారి వివరాలు ఖచ్చితంగా వారికి తెలిసి ఉండాలని లేదంటే ప్రైవేటు సంస్థల ద్వారా అయినా వారిపై విచారణ చేయించుకుని వివరాలు తెలుసుకోవాలని డీఎస్పీ సూచిం చారు. ఏలూరు జిల్లాలో ఇటీవల జరుగుతున్న సంఘటనల నేపథ్యంలో జిల్లా ప్రజల భద్రతను పటిష్టం చేయడానికి జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశాల మేరకు పబ్లిక్ సేఫ్టీ (మెజర్స్) ఎన్‌ఫోర్స్‌మెంట్‌యాక్టు 2013 నిబంధనలను అమలు చేయడానికి చర్యలు చేపడుతున్నా మన్నారు. ఒక సీసీ కెమెరా పది మంది పోలీసులతో సమానమని సీసీ కెమెరాల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. వ్యాపా ర సంస్థలు ఉద్యోగులను నియమించుకునే ముందు ఆ ఉద్యోగులకు సంబంధించి పోలీసు వెరిఫికేషన్ సర్టిఫికెట్లను పొందాలని సూచించారు. పోలీస్ వెరిఫికేషన్ లేకుండా ఎవరైనా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే ఆ ఉద్యోగి ఏదైనా నేరాల్లో పాల్గొన్న ట్లయితే ఆ సంస్థ యజమానులపై పబ్లిక్ సేఫ్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్‌యాక్టు కింద చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో శాంతి భద్రతలు కాపాడడానికి ప్రతి ఒక్క పోలీసులకు సహకరించాలని అన్నారు.


గొడౌన్‌లోని గృహ నిర్మాణ సామగ్రిని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే చంటి

గొడౌన్‌లో గృహ నిర్మాణ సామగ్రి

మూడేళ్లుగా దోచేస్తున్న గృహ నిర్మాణ సిబ్బంది
ఎమ్మెల్యే తనిఖీలో బయటపడ్డ రూ.8 కోట్ల సామగ్రి వ్యవహారం

ఏలూరు టూటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం వలన రూ.8కోట్లు విలువైన ప్రజాధనం దుర్వినియోగం అయ్యింది. ప్రభుత్వం పేదలకు నిర్మించే గృహాలకు చెందిన మెటీరియల్ మూడు సంవత్సరాలుగా గొడౌన్‌లో మగ్గుతున్నది. ఈ విషయాన్ని గృహనిర్మాణ అధికారులు ఎందుకు దాచి పెట్టారో తెలియదు. 2022వ సంవత్సరంలో పేదలకు గృహాలు నిర్మించడానికి వైసీపీ ప్రభుత్వం 8కోట్ల 25లక్షల విలువైన ఇంటిడోర్లు, ఫ్యాన్లు, వైర్లు, ఎల్ఈడీ బల్బులు గొడౌన్‌లో దాచి ఉంచారు. అనంతరం రెండు సంవత్సరాలు వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికి వాటిని ముట్టుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి 16నెలలు గడుస్తున్నప్పటికి ఇంత వరకు హౌసింగ్ అధికారులు ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యేకి కూడా తెలియనివ్వలేదు. హౌసింగ్ అధికారులతో ఎన్నోసార్లు స్థానిక ఎమ్మెల్యే బడేటి చంటి మీటింగులుపెట్టినా ఆ సమావేశాల్లో కూడా తెలియనివ్వలేదు. 8కోట్ల 25లక్షల విలువైన సామగ్రి చాలా వరకు పాడైపోయింది. దీంతో పాటు ఇంటి దొంగలే ఇంటికి కన్నం వేసినట్లు హౌసింగ్ సిబ్బంది సామాన్లు దొంగిలిస్తున్నారు. ఈ విషయాన్ని పసిగట్టిన ఎమ్మెల్యే బడేటి చంటి క్యాంపు కార్యాలయ సిబ్బంది ఈ విషయాన్ని ఎమ్మెల్యే బడేటి చంటికి చేరవేశారు. వెంటనే ఎమ్మెల్యే బడేటి చంటి గొడౌన్‌కు వెళ్లి తనిఖీ చేయగా విషయం వెలుగులోకి వచ్చింది.

బాధ్యులపై కఠిన చర్యలు ఎమ్మెల్యే చంటి

ప్రజలకు చెందాల్సిన సొత్తును దొంగదారిలో కాజేసిన హౌసింగ్ ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బడేటి చంటి హెచ్చరించారు. కొడేలులో గృహనిర్మాణ సామగ్రి దాచి ఉంచిన గొడౌన్‌ను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. అక్కడ గొడౌన్‌లో దాచి ఉంచిన గృహ లబ్ధిదారులకు చెందిన మెటీరియల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి హౌసింగ్ అధికారులను ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చి 16 నెలలు గడిచిన గొడౌన్‌లో మేటిరియల్ ఉందని ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. వాటి లెక్కలపై అధికారులకు ప్రశ్నల వర్షం కురిపించారు. గొడౌన్‌లో 15536మంది లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి చెందిన మెటీరియల్ 8కోట్ల 25లక్షలు విలువ ఉంటుందని అధికారులు సమాధానం చెప్పగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి విచారణ చేయిస్తామన్నారు. బాధ్యులు ఎంతటి వారైన సరే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసలు దీని వెనుక ఎవరి హస్తం ఉందో నిగ్గు తేలుస్తామన్నారు. హౌసింగ్ సిబ్బంది మేటిరియల్‌ను చోరి చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. దీని వెనుక వైసీపీ నాయకుల హస్తం ఉందా అని అనుమానం వ్యక్తం చేశారు.

యువకుడిపై పోక్సో కేసు

కైకలూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మైనర్ యువతికి ఫోన్ చేసి పెళ్ళి చేసుకోవాలని లేకుంటే అంతు చూస్తా అని బెదిరించిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు కైకలూరు రూరల్ ఎస్సై వి.రాంబాబు తెలిపారు. మండలంలోని ఒక గ్రామానికి చెందిన 17ఏళ్ల మైనర్ యువతి ఇంటర్ పూర్తిచేసి ఇంటి వద్దనే ఉంటుంది. చదువుకునే రోజుల్లో కలిదిండి మండలం తాడినాడ శివారు విభారావపురం గ్రామానికి చెందిన పామర్తి భార్గవ్‌తో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయాన్ని అడ్డుపెట్టుకుని గతంలో యువతి తల్లిదండ్రులు లేని సమయంలో ఇంటికి వచ్చి లైంగికంగా వేధించి బలవంతం చేసేందుకు ప్రయత్నం చేశాడు. యువతి కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయాడు. అల్లరి అయితే పరువు పోతుందని భయంతో తల్లిదండ్రులు ఎవరికి చెప్పలేదు. దీన్ని అలు సుగా తీసుకుని గత నాలుగు రోజులుగా భార్గవ్ ఆ యువతికి ఫోన్ చేసి పెళ్లి చేసుకోవాలని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆ యువతి కైకలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సై భార్గవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆచంట సీహెచ్‌సీలో చిన్న పిల్లల వైద్యురాలి నియామకం

ఆచంట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆచంట సామాజిక ఆరోగ్య కేంద్రంలో చిన్న పిల్లల వైద్యురాలిగా డాక్టర్ ఆర్.లలిత రాణి నియమితులయ్యారు. చిన్న పిల్లల వైద్యం నిమిత్తం నియమితులైన డాక్టర్ బాధ్యతలు చేపట్టినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనూష తెలిపారు. ఆచంట మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు, పరిసర ప్రాంతాల వారు తమ పిల్లలకు వైద్య సహాయం నిమిత్తం సంప్రదించవచ్చని, డాక్టర్ వైద్య సలహాలు సూచనలు అందిస్తారని ప్రతీ ఒక్కరూ సద్వినియోగించాలని కోరారు.

శ్రీరాంపురం రోడ్డు అందుబాటులోకి తేవాలి : కలెక్టర్

భీమవరం టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జువ్వలపాలెం రోడ్డు నుంచి బలుసుమూడి వరకు నిర్మాణంలో ఉన్న శ్రీరాంపురం ప్రధాన రహదారిని డిసెంబర్ 15 నాటికి అందుబాటులోకి తేవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి మునిపల్ అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో రహదారిని గురువారం ఆమె పరిశీలించారు. మునిసిపల్ ఈఈ పి.త్రినాథరావు ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వచ్చేనెల 15లోగా ప్రజలకు అందుబాటులోకి తెస్తామని కలెక్టర్‌కు వివరించారు. డీఈ శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

కాళ్లకూరు దేవస్థానం చైర్మన్‌గా శివరామరాజు


రఘురామకృష్ణరాజుతో శివరామరాజు (ఫైల్)

కాళ్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా మాజీ సర్పంచ్ అడ్డాల శివరామరాజు (రాము) ప్రభుత్వం నియమించింది. మరో పది మంది సభ్యులను ఎంపిక చేసింది. తమకు ఈ అవకాశం కల్పించిన డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజుకు రాము కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ స్పీకర్ సమక్షంలో నూతన కార్యవర్గం శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు దేవస్థానం ఈవో ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు. చైర్మన్‌గా ఎంపికైన రాముకు పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.

సూర్యాలయం చైర్మన్‌గా గమిని రామచంద్రరావు


ప్రమాణ స్వీకారం చేసిన ఆలయ కమిటీ

తణుకు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సూర్యాలయం కమిటీ భక్తులకు, ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. కమిటీ అధ్యక్షుడిగా గమిని రామచంద్రరావు, ధర్మకర్తలుగా కొయ్యాని సత్యనారాయణ, బడేటి సాయిరాం, కల్యకుంట భవాని, చర్ల వెంకట సుబలక్ష్మి, తదితరులతో ఈవో ముత్యాల సత్యనారాయణ గురువారం ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది

తణుకు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అభావృద్ధి కార్యక్రమాలకు దాతల సహకారం మరువలేనిదని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సజ్జాపురం స్కూల్‌కు ప్రముఖ పారిశ్రామికవేత్త చిలుకూరి విశ్వేశ్వరరావు, సతీమణి చిలుకూరి కృష్ణవేణి జ్ఞాపకార్థం నిర్మించిన ఆర్‌వో ప్లాంట్‌ను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ గురువారం ప్రారంభించారు. దొమ్మేటి వెంకట సుధాకర్ తల్లిదండ్రులు పేరు దొమ్మేటి గోపాలకృష్ణ, ఇందిరాదేవి జ్ఞాపకార్థం రూ.లక్ష అందజేశారు. ఈసందర్భంగా దాతలు సేవలను కొనియాడారు. సజ్జాపురం ప్రాంత అభివృద్ధి ఎంతోమంది సహకారం అందిస్తు అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నట్లు వివరించారు. మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మెగా పేరెంట్ ఈవెంట్ ఏర్పాటు చేసి పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఏలేటిపాడు సొసైటీ సేవలు అభినందనీయం


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

ఇరగవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలతో ఏలేటిపాడు సొసైటీ ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఏలేటిపాడు సొసైటీ నిర్వహిస్తున్న రైస్‌మిల్లులోని డ్రైయర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. రైస్‌మిల్లు, పెట్రోల్‌బంకు, సూపర్‌మార్కెట్, పాలకేంద్రం ఇలా ఎన్నో రకాల వ్యాపారాలతో రైతులకు ఉపయోగపడేలా కృషి చేస్తోందన్నారు. విశ్వేశ్వరరెడ్డి సొసైటీ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తూ సొసైటీను విస్తరించేందుకు ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ విశ్వేశ్వరరెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాస్, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

బీసీలకు రక్షణ చట్టం తీసుకురావాలి

మొగల్తూరు, నవంబరు27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు బీసీ రక్షణ చట్టం తీసుకురావాలని జాతీయ సమైక్య, సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుత్తుల తులసి గిరి డిమాండ్ చేశారు. మొగల్తూరులో గురువారం నిర్వహించిన బీసీ సంఘ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ కులగణన చేపట్టాలని ఎన్నో ఏళ్లగా పోరాటాలు చేస్తున్నా ప్రయోజనం లేదన్నారు. త్వరలో అన్ని బీసీ కులాలను కలుపుకుంటూ గ్రామ, మండల కమిటీలు ఏర్పాటుచేసి హక్కుల సాధనకు పోరాటాలు చేస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎం.గంగారాం, ప్రధాన కార్యదర్శి కండిబోయిన సుబ్రహ్మణ్యం, కడలి శివన్నారాయణ, నాగిడి భగవాన్, వాటాల కృష్ణమూర్తి, కవురు శ్రీనివాస్, మామిడిశెట్టి నర్సింహరావు తదితరులున్నారు.

బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి

పాలకొలు అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బహుజనుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 139 బీసీ కులాలకు చట్ట సభల్లో రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంక్షేమ సఘం రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాడ గణేష్ భవాని అన్నారు. శంభునిపేటలో నియోజకవర్గ అధ్యక్షుడు పొన్నమండ ముత్యాలరావు నివాసంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో విజయలక్ష్మి, పాలవలస స్వామి, కె సుబ్బారావు, వింజరపు శంకరం, మందపాక రాజు, పట్టణ మహిళా అధ్యక్షురాలు నాగులకొండ మంగాదేవి, గబ్బిడి నరసింహరావు, తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్‌తో నేలకొరిగిన చెట్లు ఏమయ్యాయి?

- వాడివేడిగా నరసాపురం మునిసిపల్ కౌన్సిల్ సమావేశం
- కమిషనర్‌ను ప్రశ్నించిన సభ్యులు
- సమాధానం లేకపోవడంతో సమావేశం వాయిదా


సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న అధికార, ప్రతిపక్ష సభ్యులు

నరసాపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌లో నేలకొరిగిన చెట్లు ఏమయ్యాయని సభ్యుల ప్రశ్నలతో గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశం రసాభసాగా మారింది. కమిషనర్ అంజయ్య సరైన సమాధానం చెప్పకపోవడంతో సభను శుక్రవారానికి వాయిదా వేశారు. చైర్‌పర్సన్ వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 12వార్డు సభ్యుడు సఖినేటిపల్లి సురేష్ మాట్లాడుతూ తుఫాన్ గాలులకు పట్టణంలో భారీ వృక్షాలు నేలకొరిగాయి. వాటిలో వందేళ్ల నాటి చెట్లు ఉన్నాయి. వీటిని తొలగించి ఎక్కడ పెట్టారని ప్రశ్నించారు. కమిషనర్ అంజయ్య నుంచి సరైన సమాధానం రాలేదు. దీంతో 5వ వార్డు సభ్యుడు వన్నెంరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ చెట్లు అమ్మేశారా, ఎవరైనా పట్టుకెళ్లారా అంటూ నిలదీశారు. ఒక వేళ అమ్మి ఉంటే ధర ఎవరు నిర్ణయించారని ప్రశ్నించారు. స్వతంత్ర సభ్యుడు కోటిపల్లి సురేష్, వీసీ కొత్తపల్లి నాని, కామన నాగిని, శ్రీకాంత్, బొంతు రాజశేఖర్ జత కలిశారు. పడిన చెట్లు, దుంగలు మునిసిపల్ కార్యాలయంలో కనిపించడం లేదు. వాటిని విక్రయించారన్న ఆరోపణలు నిజమేనా అని ప్రశ్నించారు. కమిషనర్ తనకు తెలియదని, విచారణ నిర్వహిస్తానని సమాధానం ఇచ్చారు. సఖినేటిపల్లి సురేష్ మాట్లాడుతూ విచారణతో సరిపెట్టవొద్దు, ఉద్యోగులు ఈ పని చేసి ఉంటే వారిపై కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. దీనికి కమిషనర్ స్పష్టమైన సమాధానం ఇవ్వకపోవడంతో సమావేశాన్ని శుక్రవారానికి వాయిదా వేసినట్లు చైర్ పర్సన్ వెంకటరమణ ప్రకటించారు.

అంతకు ముందు గత నెలలో సమావేశాన్ని ఎందుకు నిర్వహించలేదని వీసీ కొత్తపల్లి నాని, కేసరి గంగరాజు, కోటిపల్లి సురేష్ ఆధికారులను ప్రశ్నించారు. దీంతో పాటు పట్టణంలో చెత్త సమస్య, రోడ్ల మరమ్మతులు, డ్రెయినేజీల్లో పూడిక తొలగించకపోవడంపై సిర్రా కాంతమ్మ, పద్మ, దుర్గాభవాని, రామసీత నిలదీశారు. సచివాలయ వ్యవస్థ పూర్తిగా నిద్రపోయిందని, సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరితే పట్టించుకోవడం లేదని టీడీపీ కౌన్సిలర్ పాలూరి బాబ్జీ మండిపడ్డారు. తుఫాన్ వచ్చినా తమ వార్డులో ఎమ్మెల్యే, చైర్‌పర్సన్, అధికారులు ఎవరూ రాలేదని ఆడిదెల శ్యామల సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి జనసేన కౌన్సిలర్లు ఆరుణ, సూర్యకుమారి, కృష్ణవేణి అభ్యంతరం తెలిపారు. ఎమ్మెల్యే నాయకర్ నిరంతరం అన్ని వార్డుల్లో తిరుగుతూ సమస్యల్ని పరిష్కరించారు. ఈ విషయం మీకు తెలియాదా అంటూ జనసేన కౌన్సిలర్లు మండిపడ్డారు. దీంతో శ్యామల, జనసేన కౌన్సిలర్ల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. నేను మా వార్డులో ఎవరూ రాలేదని చెపితే... మీరెందుకు అభ్యంతరం తెలుపుతున్నారంటూ ప్రశ్నించారు. చివరికి చైర్‌పర్సన్ జోక్యం చేసుకోవడంతో వివాదం సర్దుమణిగింది.

సెల్‌ఫోన్ వినియోగంలో అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న నరసింహారావు

పాలకొల్లు అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్లు సెల్‌ఫోన్ వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా జాగ్రత్త వహించాలని హెల్ప్‌ఏజ్ ఇండియా ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్యామ్‌కుమార్ అన్నారు. సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంగా నరసింహారావు అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫోన్‌లో బ్యాంక్ ఖాతా, ఆధార్ కార్డు, ఓటీపీ వివరాలు చెప్పరాదని సూచించారు. కార్యదర్శి జీఎస్ఎన్ మూర్తి, కోశాధికారి మామం బాలకొండలరావు, సభ్యులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా తనిఖీ చేయాలి

ఉండి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఓటర్లు జాబితా త్వరితగతిన తనిఖీ చేయాలని సహాయక ఓటర్ల నమోదు అధికారి కె.నాగార్జున బీఎల్వోలకు సూచించారు. తహసీల్దారు కార్యలయంలో బూత్ లెవెల్ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. 2002లో ఓటర్ల జాబితాను 2025 ఓటర్ల జాబితాతో తనిఖీకి సూచనలు ఇచ్చారు. కాళ్ల తహసీల్దారు సుందర సింగ్, ఎన్నికల డీటీ ఎస్.రత్నకుమార్ బీఎల్వోలు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

నరసాపురం రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించాలని ఎమ్మెల్యే నాయకర్ అన్నారు. వేములదీవి గ్రామంలో కేంద్ర హస్తకళలు, టెక్స్‌టైల్స్ మంత్రిత్వశాఖ సహకారంతో 32 మంది మహిళలకు గురువారం కుట్టు మిషన్లను టీడీపీ ఇన్‌చార్జి రామరాజుతో కలిసి అందించారు. ట్రెండ్స్‌కు అనుగుణంగా మహిళలు టైలరింగ్, లేసు అల్లికల్లో శిక్షణ పొందాలన్నారు. ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, రాజ్యలక్ష్మి, పీడీ సుదీర్‌కుమార్, షైలా వసంతరావు, వాతాడి ఉమా, ముక్తేశ్వరరావు పాల్గొన్నారు.

రాజ్ ట్రస్టు సేవలు అద్వితీయం

భీమవరం టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతి కోసం రాజ్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అద్వితీయమని ఏఎంసీ చైర్మన్ కలిదిండి సుజాత అన్నారు. చిన అమిరంలో గంటా రాజ్‌కుమార్ సహకారంతో 23 మంది మహిళలకు కుట్టు మిషన్లు అందించారు. చినిమిల్లి వెంకట్రాయుడు, గంటా సుందర్ కుమార్, రాజ్ ట్రస్టు వ్యవస్థాపకులు గంటా రాజ్ కుమార్ మాట్లాడారు. కలిదిండి రామచంద్రరాజు, కోమటి రవికుమార్, గొట్టుముక్కల పద్మనాభరాజు, తదితరులు పాల్గొన్నారు.


పార్టీ కండువాతో స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే నాయకర్, నేతలు

జెట్టిపాలెంలో జనసేన పార్టీలో చేరికలు

మొగల్తూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రామన్నపాలెం పంచాయతీ పరిధి జెట్టిపాలెంలో కడలి బాబులు ఆధ్వర్యంలో గురువారం సుమారు 300 మంది జనసేన పార్టీలో చేరారు. కడలి బాబులు, కడలి ఏసు ఆధ్వర్యంలో వారి అనుచరులు జనసేనలో చేరగా ఎమ్మెల్యే నాయకర్ పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. కూటమి పాలనలో పవన్ కల్యాణ్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు తోడు స్థానిక ఎమ్మెల్యే నాయకర్ కృషికి ఆకర్షితులై జనసేనలో చేరుతున్నట్టు వారు ప్రకటించారు. నియోజకవర్గ, మండల జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రెయినేజీల నిర్వహణ మెరుగుపరుస్తాం


డ్రెయినేజి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలో డ్రెయినేజి వ్యవస్థ నిర్వహణ మెరుగుపరుస్తామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని డ్రెయినేజీ, పారిశుధ్యం నిర్వహణను గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డ్రెయినేజీ అవుట్‌లెట్లు సరి చేయాలని అధికారులకు సూచించారు. పారిశుద్యం నిర్వహణలో అలసత్వం వద్దని సిబ్బందికి చెప్పారు. తహసీల్దార్ సునీల్‌కుమార్, సర్వేయర్ రామకృష్ణ, ఏసీటీ సీతారాం, ఎంఈ వెంకటరమణ, టీపీవో జగదీష్, చాపల రమేష్, మద్దాల మణికుమార్, అడ్డగర్ల సురేష్, పైబోయిన వెంకట రామయ్య, రామిశెట్టి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం సీఎం ఆర్‌ఎఫ్ రూ.1.10లక్షల చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే శ్రీనివాస్ అందజేశారు. పెంటపాడుకు నక్కా పావనీదేవికి రూ.60వేలు, తాడేపల్లిగూడెం మండలం మారంపల్లి గ్రామానికి చెందిన అల్లు వెంకటేశ్వరరావుకు రూ.50వేలు చెక్కును అందజేశారు.

రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఆచంట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుల అభివృద్ధికి కృషి చేస్తుందని జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు అన్నారు. కరుగోరుమిల్లి, ఎ.వేమవరం, శేషమ్మచెరువులో గురువారం జరిగిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు చిలుకూరి సీతారాం, కేతా మీరయ్య, నెక్కంటి సత్తిబాబు, జక్కంశెట్టి సత్యనారాయణ, ఏవో బి.నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

రానున్న రెండు రోజుల్లో వర్షాలు

ఆచంట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా శని, ఆదివారాల్లో వర్షాలు కురుస్తాయనే సమాచారం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జి.కనకరాజు అన్నారు. రెండు రోజులు పాటు కోతలు కోయవద్దని, ఇప్పటికే కోత పూర్తయితే ధాన్యాన్ని ఆరబెట్టడానికి రైతు సేవా కేంద్రాల్లో టార్పాలిన్, బరకాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రతీ గ్రామ రైతులు వీటిని ఉపయోగించుకోవాలని తెలిపారు.

అక్రమ లే అవుట్లలో స్థలాలు కొనుగోలు చేయొద్దు

గణపవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేసిన వారికి ఎటువంటి సదుపాయాలు కల్పించబోమని సరిపల్లె గ్రామ సెక్రటరీ రామాంజనేయులు స్పష్టం చేశారు. అనధికార లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేసిన యజమానులు ఈ ఏడాది 2025 జనవరి 23లోపు దరఖాస్తు చేసుకున్నవారికి రెగ్యులరైజేషన్ చేస్తామన్నారు. అనధికార లేఅవుట్లలలో స్థలాలకు గ్రామ పంచాయతీ నుంచి మంచినీటి కనెక్షన్లు, డ్రెయినేజీ సౌకర్యాలు కల్పించలేమన్నారు. ఆయా గ్రామాల్లో పలు కూడళ్లలో హెచ్చరిక బోర్డులు పెట్టామన్నారు. ప్రభుత్వం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్‌ను ప్రవేశపెట్టిందన్నారు.

బాల్య వివాహరహిత గ్రామంగా తీర్చిదిద్దాలి

అత్తిలి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయరాదని ప్రజలకు అవగాహన కల్పించి బాల్య వివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అత్తిలి సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.విజయకుమారి అన్నారు. కె.సముద్రపుగట్టు అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, కిశోర బాలికలకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. విజయకుమారి మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 ఏళ్లు నిండకుండా వివాహాలు చేయడం వలన ఆరోగ్యపరమైన సమస్యలు వస్తాయని, చట్టరీత్యా శిక్ష పడుతుందని తెలిపారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు ఎస్ దీపి కారాణి, నవోమి, పూర్ణగిరి, తల్లులు, బాలికలు, మహిళలు పాల్గొన్నారు.

గణపవరంలో కప్పాలమ్మ ఊరేగింపు


అమ్మవారి ఊరేగింపు

గణపవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గణపవరం నడివీధిలో కప్పాలమ్మ అమ్మవారి ఊరేగింపు గురువారం నిర్వహించారు. సరిపల్లె దేవాలయంలో అమ్మవారిని బాణ సంచా, మేళతాళాలతో నడివీధిలోని పూరిగుడిసెలో నిలబెట్టారు. గణపవరం ఇలవేల్పు దండు మారెమ్మ తిరునాళ్లకు మూడు నెలలు ముందుగా కప్పాలమ్మ అమ్మవారిని పూరిగుడిసెలో నిలబెడతారు. దండు మారెమ్మ తిరునాళ్లకు కప్పాలమ్మ అమ్మవార్ని సరిపల్లెలోని ఆలయానికి తీసుకెళతారు. మూడు నెలల పాటు గ్రామంలో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. దండు బంగారురాజు, ఉత్సవ కమిటీ సభ్యులు కొనిశెట్టి రమేష్, వేగేశ్న ప్రసాదరాజు, సింగంశెట్టి సుబ్బారావు, ప్రధాన అర్చకులు కైతేపల్లి విజయబాబు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్బారాయుడి ఊరేగింపు

అత్తిలి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): షష్టి ఉత్సవాల సందర్భంగా గురువారం సుబ్బారాయుడి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. బుట్ట బొమ్మలు, కోయడాన్సులు, తీన్మార్ డప్పులు, వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఊరేగింపు ఉత్సవాన్ని తిలకించారు. ఊరేగింపు సందర్భంగా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

అయ్యప్ప భక్తులు సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అర్చకుడు ఐలూరి రామం, కృష్ణ దీక్షాదారులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గ్రామోత్సవం


ఊరేగింపునకు ఉత్సవ మూర్తి తరలింపు

ఆకివీడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గ్రామోత్సవం గురువారం జరిగింది. మేళతాళాలు, సన్నాయి వాయిద్యాల నడుమ పల్లకీసేవ నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ బొల్లా వెంకట్రావు, ఆలయ చైర్మన్ జేఎస్ఆర్, అర్చకులు రామకృష్ణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంధం ఉమా, కిమిడి నాగరాజు, మన్నే పోతురాజు, రంజిత్, రాంబాబు, భక్తులు ఉన్నారు.

ఆచంటేశ్వరుడి హుండీ ఆదాయం రూ.4.97 లక్షలు


హుండీ ఆదాయం లెక్కింపు

ఆచంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆచంట రామేశ్వరస్వామి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. రూ. 4,97,279 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో ఆదిమూలం వెంకట సత్యనారాయణ తెలిపారు. గుమ్ములూరు దేవస్థానం అధికారి వి.శ్రీనివాసరాజు సమక్షంలో లెక్కించగా 269 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నెక్కంటి గణేశ్వరరావు, కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటాలి

గణపవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విద్యార్థులు మొక్కలు నాటి ప్రకృతిని పరిరక్షించాలని ప్రిన్సిపాల్ నిర్మలకుమారి అన్నారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థుల క్యాంపులో భాగంగా గురువారం కొత్తపల్లిలో వంద మొక్కలు వరకు నాటారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెంకటరమణ, అధ్యాపకులు శారదాదేవి, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం అభినందనీయం

పెంటపాడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రక్తదానం వల్ల మరొకరికి ప్రాణదానం అని ప్రిన్సిపాల్ ఎస్. వెంకటేశ్వరరావు అన్నారు. డీఆర్ గోయింకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన విద్యార్థులకు రెడ్‌క్రాస్ తరఫున ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి ప్రేమ్‌సాగర్, ఎన్ఎస్ఎస్ అధికారి విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అందించిన ఘనత అంబేడ్కర్‌దే


అంబేడ్కర్ వేషధారణలో విద్యార్థి

తణుకు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాలలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశానికి లిఖిత రాజ్యాంగాన్ని అందించిన ఘనత భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు దక్కుతుందని తేతలి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కేఎస్‌వీవీ.ప్రసాద్ అన్నారు. భారత రాజ్యాంగ ముసాయిదా ఆమోదం పొందిన రోజు సందర్భంగా తేతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులకు రాజ్యాంగ విశిష్టత గురించి వివరించారు. ఈసందర్భంగా బీఆర్ అంబేడ్కర్ వేషధారణతో విద్యార్థి అలరించాడు. కార్యక్రమంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన, విద్యార్థులకు పోటీలు

పాలకొల్లు టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌పై అవగాహన కలిగించడానికి విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్టు ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. గురువారం నుంచి డిసెంబరు 1 వరకూ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గురువారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ ట్రాప్ !

(3వ పేజీ తరువాయి)

ఎత్తారు. విద్యా వంతులు, ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు చేసిన వారు కూడా నేరాలకు పాల్పడుతున్నారు. డిజిటల్ అరెస్టులంటూ కొత్త బాణీ అనుసరిస్తున్నారు. లక్షల్లో సొమ్ములు కాజేస్తున్నారు. తొలిసారిగా జిల్లాలో పోలీసులు అంతర్జాతీయ సైబర్ నేరాల ముఠా గుట్టు రట్టు చేసింది. 12 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 72 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. డిజిటల్ సాంకేతిక విజ్ఞానంలో శిక్షణ పొందిన పోలీసు అధికారి కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించారు. ఆరు నెలలపాటు సదరు అధికారి శిక్షణ పొందారు. భీమవరంలో ఒక విశ్రాంత ప్రొఫెసర్ సైబర్ వలలో చిక్కుకున్నారు. నాలుగు బ్యాంకుల నుంచి సొమ్మును నేరగాళ్ల ఖాతాలోకి బదిలీ చేశారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. అవతలి వ్యక్తి ఖాతా ఆధారంగా కేసును ఛేదించారు.

సంక్షిప్త సమాచారం..

- **తాడేపల్లిగూడెం :** ఉద్దరాజు రామం పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాటం చేసిన యోధుడు అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు అన్నారు. సుందరయ్య భవనంలో ఉద్దరాజు రామం వర్ధంతి గురువారం నిర్వహించారు.
- **తాడేపల్లిగూడెం రూరల్ :** రైల్వే సిగ్నల్ ఆపరేషన్స్(విజయవాడ) అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేస్తున్న పీవీ కొండయ్యను సహోద్యోగులు గురువారం సత్కరించారు. ఉప్పలపాటి వీరవెంకట సత్యనారాయణ ఎస్.వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.
- **కాళ్ల :** యంగ్ మైండ్ ఇంటర్నేషనల్ సహకారంతో కలవపూడిలో నూతన క్లబ్‌ను గురువారం ఏర్పాటు చేశారు. ఏజేసీ శోభనబాబు అధ్యక్షతన జరిగిన ఎన్నికలో అధ్యక్షుడిగా ఎస్.యాకోబు, కార్యదర్శి ఎం.రత్నకుమార్, కోశాధికారి డి.శామ్యూల్, సభ్యులను ఎన్నుకున్నారు.
- **ఉండి :** డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సహకారంతో మేజర్ పంచాయితీయైన ఉండిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు కరిమెరక నాగరాజు, సర్పంచ్ కమతం సౌజన్య బెనర్జి అన్నారు. కాపులపేట మార్కెట్‌కు దారిలో కల్వర్టును నిర్మాణం పూర్తిచేశారు.
- **నరసాపురం టౌన్ :** పట్టణంలోని లెనిన్‌హైస్కూల్ విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయవాది చదలవాడ జ్ఞాన్ ప్రకాశ్ రాజ్యాంగంపై అవగాహన కల్పించారు. రూ.20వేలు విలువ చేసే మైక్‌సెట్ అందించారు. ఎంఈవోలు పుష్పరాజ్యం, జాన్ ప్రభాకర్, హెచ్‌ఎం పెద్దిరాజు పాల్గొన్నారు
- **పెనుగొండ :** ఇలపర్రు హైస్కూలు విద్యార్థులకు తాగునీటి కోసం సర్పంచ్ దండు పద్మావతి రూ.1.85 లక్షల విలువైన ఆర్‌వో ప్లాంట్‌ను పాఠశాలకు అందించారు. సొసైటీ చైర్మన్ కేతా సత్తిబాబు, ఎంపీటీసీ పడపట్ల పద్మనాగేశ్వరి, చికిలే కృష్ణబాబు పాల్గొన్నారు.
- పెనుగొండలోని ప్రశాంతి అనాథాశ్రమానికి ఎస్ఐ కె.గంగాధరరావు రూ.30వేలు విలువ చేసే టీవీ బహూకరించారు. బీవీ.రమణ చారిటబుల్ ట్రస్టు గౌరవాధ్యక్షులు కానిస్టేబుల్ బీవీ రమణ సేవలను అభినందించారు. బి.అరుణ, కె.లక్ష్మణరావు, బి.నాగరాజు పాల్గొన్నారు.
- లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని సీఐటీయు డిమాండ్ చేసింది. పెనుగొండలో నిరశన కార్యక్రమంలో ఎస్.వెంకటేశ్వరరావు, కానూరి తులసి, ఎస్‌కె పాదుషా, నాగిశెట్టి గంగారావు తదితరులు పాల్గొన్నారు.
- **పెంటపాడు :** పెంటపాడు పాఠశాలలో సమగ్ర మూల్యాంకనం కార్యక్రమాన్ని నిర్వహించారు. డైట్ అధ్యాపకుడు వి.స్వరాజ్య శ్రీనివాస్, ఎంఈవో శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు ఝాన్సీ, క్లస్టర్ టీచర్ రాజు, సీఆర్‌పీ చిట్టెమ్మ, తదితరులు పాల్గొన్నారు.